-7_-7.qxd 4/25/2026 12:23 AM Page 1



# ఉక్కు వీఆర్ఎస్ చెల్లింపుల్లో తీవ్ర వివక్ష!

- నిధులున్నా బకాయిలు ఆపిన ఆర్ఐఎన్ఎల్
- యాజమాన్యానికి 130 మంది ఉద్యోగుల లీగల్ నోటీసు
- వారంలోగా చెల్లించకుంటే న్యాయపోరాటం

**గాజువాక,ఏప్రిల్ 24,ప్రభాతవార్త**

విశాఖ ఉక్కు పరిశ్రమ (ఆర్ఐఎన్ఎల్)లో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పొందిన ఉద్యోగుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరణ ప్యాకేజీ కింద నిధులు కేటాయించినప్పటికీ, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో తీవ్ర వివక్ష చూపుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు 130 మంది ఉద్యోగులు శుక్రవారం యాజమాన్యానికి లీగల్ నోటీసులు జారీ చేశారు.దశల వారీగా కోత....కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11,400 కోట్ల పునరుద్ధరణ ప్యాకేజీలో వీఆర్ఎస్ కోసం సుమారు రూ.500 కోట్లు కేటాయించారు. అయితే, దీని అమలులో యాజమాన్యం మూడు రకాల విధానాలను అవలంబించడం గమనార్హం. మార్చి 2025లో విరమణ పొందిన 1,137 మందికి 100 శాతం ప్యాకేజీ చెల్లించగా,సెప్టెంబర్ 2025లో విరమణ చేసిన




464 మందికి కేవలం 50 శాతమే అందజేశారు. తాజాగా మార్చి 2026లో విరమణ చేసిన వారికి కేవలం 25 శాతమే ఇచ్చినట్లు సమాచారం. నిధుల మళ్లింపు ఆరోపణలు వీఆర్ఎస్ కోసం కేటాయించిన నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఇతర అవసరాలకు మళ్లించారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సెప్టెంబర్ బ్యాచ్ మిగతా 8..లో



విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త

# యువత కష్టం.. అవకాశం కలిసినప్పుడే విజయం సాధ్యం..

- గోపాలపట్నంలో నిర్వహించిన జాబ్‌మేళాలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి అవకాశాలు, ఉపాధి

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

నిరుద్యోగ యువత కష్టం.. దానికి తగ్గ అవకాశాలు కలిసి వచ్చినప్పుడే విజయం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతమవడం అభినందనీయమన్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో సంవత్సరానికి కనీసం నాలుగు జాబ్ మేళాలు నిర్వహించి, మిగతా 8..లో




## ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన గంటా

**ఆనందపురం, ఏప్రిల్ 24: ప్రభాతవార్త**



ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. సరైన సేవలందుతున్నాయా అని ఆరాతీశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు పని తీరును సమీక్షించారు. ప్రభుత్వ ఇస్తున్న మందులు, వాటి గడువు తేదీలను చూశారు. రోగులకు ఇస్తున్న మందుల రికార్డును తనిఖీ చేశారు. రూ. 50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ద్వారా అందిస్తున్న సేవలను అడిగి మిగతా 8..లో

## విద్యార్థులంతా వేడుకలకు సులభంగా చేరుకునేలా ప్రణాళికలు..

- కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ భరత్ గుప్తాతో కలిసి సమీక్షించిన జిల్లా కలెక్టర్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏయూ శతాబ్ది వేడుకలకు విద్యార్థులంతా సులభంగా, నిర్ణీత సమయానికి చేరుకునేలా అధికారులు ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ భరత్ గుప్తాతో కలిసి శుక్రవారం ఉదయం ఏయూ సమీపంలోని ఎస్.బి.ఐ. వద్ద కోదండరామ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్షించారు. విద్యార్థుల రాక, పార్కింగ్, బస్సు సదుపాయం, రూట్ మ్యాప్, పాసుల జారీ తదితర అంశాలపై వారు చర్చించారు. ఎలాంటి విధానాలు అవలంబించాలో అధికారులకు సూచనలు చేశారు. ఏయూ మిగతా 8..లో

## మహిళా విద్యార్థినులకు సైబర్ సెక్యూరిటీ, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు

**విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

నగరంలో వున్న ఏఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాల, ఆల్వార్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా విద్యార్థినుల కోసం సైబర్ సెక్యూరిటీ, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలను సీమా సిక్రి నిర్వహించారు. ఆమె సురక్షితమైన ఆన్‌లైన్




వినియోగం, సైబర్ ముప్పులను గుర్తించడం, పోక్సో చట్టంలోని రక్షణలు, మరియు ఏ విధమైన దుర్వినియోగానికి గురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం గురించి వివరించారు. కార్యక్రమాలు ఇంటరాక్టివ్‌గా నిర్వహించబడగా, విద్యార్థినులు చురుకుగా పాల్గొని చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు మా జాయింట్ సెక్రటరీలు మిగతా 8..లో

## విశాఖ పర్యాటకానికి రెక్కలు

- గ్లోబల్ డెస్టినేషన్‌గా ఎదుగుతున్న మహా నగరం బీచ్‌లు, హిల్ స్పాట్స్ సుందరీకరణ పనులు వేగవంతం అడ్వెంచర్, ఈకో, క్రూయిజ్ టూరిజంపై దృష్టి

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

సహజ సౌందర్యం, సముద్ర తీరాలు, కొండలు, వారసత్వ ప్రదేశాలతో ప్రసిద్ధి చెందిన విశాఖపట్నాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు వేగవంతమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు మౌలిక వసతుల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల అమలు, ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రాధాన్యం మిగతా 8..లో

## వార్డుల పునర్విభజనపై హైకోర్టు విచారణ

- కేంద్ర సూచనలు కోరాలని ఆదేశం

**(ప్రభాతవార్త విశాఖపట్నం)**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వార్డుల డిలిమిటేషన్ అంశంపై దాఖలైన వ్యాజ్యాలపై విచారణ కొనసాగింది. 2026కు సంబంధించిన పిటిషన్లలో పలు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయస్థానం, ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వ లిఖితపూర్వక సూచనలు అవసరమని అభిప్రాయపడింది. అదనపు సొలిసిటర్ జనరల్ ద్వారా పూర్తి సమాచారం సేకరించాలని కోర్టు ఆదేశించింది. జనాభా లెక్కల నిబంధనల ప్రకారం 2025 డిసెంబర్ 31 నాటికి ఉన్న పరిపాలనా యూనిట్లను ఫ్రీజ్ చేయాలన్న అంశంపై చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మున్సిపల్ వార్డుల పునర్విభజన చర్యలు జనగణన నియమావళికి లోబడవని, అందువల్ల ఈ ప్రక్రియకు ఎలాంటి నిషేధం లేదని అడ్వకేట్ జనరల్ వాదించారు. ఈ అంశంపై తదుపరి విచారణను ఏప్రిల్ 27కు వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది

## సీఆర్ జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన..
## శాంక్టమ్ రిసార్ట్‌ని కూల్చేయండి

- జీవీఎంసీకి హైకోర్టు ఆదేశాలు
- జీవీఎంసీ కమిషనర్ నోటీసులిచ్చినా అడ్డుకున్న ఏపీటీడీసీ
- నిబంధనల ఉల్లంఘనపై స్థానిక సొసైటీ పిల్

**విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

ఏపీ పర్యాటక శా ఖఅనుమతులిచ్చిన భవన నిర్మాణాల్ని కూల్చేయాలంటూ హైకోర్టు ఆదేశాలివ్వడం సంచలనమైంది. ఇందులో రాజకీయ పెద్దలకు వత్తాసు పలికిన ఏపీటీడీసీకీ కోర్టు అక్షింతలు వేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు మిగతా 8..లో



# ప్రతిభతో మహిళలు రాణిస్తున్నారు..



- బీచ్ రోడ్ మహిళా స్ఫూర్తిని చాటిచెప్పిన వుమెన్ వాక్తాన్..
- నాయకత్వంలో మహిళలను మరింత ప్రోత్సహించాలి..
- విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్..

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బీచ్ రోడ్డులో నిర్వహించిన "వనితా వేవ్ 100" ఉమెన్స్ వాక్‌థాన్ మహిళా శక్తిని ప్రతిబింబిస్తూ విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ, మహిళలు తమ ప్రతిభతో అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా మిగతా 8..లో

## ప్రత్యర్థులతో వ్యాపార సంబంధాలే ముద్దు..
## వైసీపీ బలోపేతంపై శ్రద్ధ లేదాయే..!

- పార్టీపై దృష్టిసారించింది ముగ్గురు మాత్రమే..
- మిగిలిన నేతలకు పట్టడం లేదు
- సమీపిస్తున్న స్థానిక సమరం అయినా పార్టీ బలోపేతంను పట్టించుకోని జిల్లా నాయకత్వం

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

ప్రతిపక్షంలో వుంటూ.. అధికార కూటమిని ఎండగొట్టాల్సిన వైసీపీ నేతలు స్వంత వ్యాపారాలపైనే దృష్టిసారించినట్టు తెలుస్తోంది. అదీ కూడా కొంతమంది వైసీపీ నేతలు అధికారపక్షంలో వున్న తమ్ముళ్ళతో వ్యాపార సంబంధాలు కొనసాగించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్ళు అవుతోంది. ఈ రెండేళ్ళ కాలంలో అమలు చేసిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలతో పాటు అమలు చెయ్యని ఎన్నికల్లో హామీ ఇచ్చిన వివిధ పథకాలపై నిలదీయాల్సిన సమన్వయం చేయాల్సినకొంత మంది నేతలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ.. తూతూ మంత్రంగానే వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీ అధినాయకత్వం రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిస్తేనే ఏదో తూతూ మంత్రంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు తప్ప.. స్థానిక సమస్యలపైన కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపడతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై స్వంతంగా ఆందోళన మిగతా 8..లో

# విశాఖ నుంచి అంతర్జాతీయ క్రూయిజ్ ప్రారంభం

- ఆంధ్రప్రదేశ్ టూరిజానికి కొత్త దిశ
- ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె. వినయ్ మోహన్

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**



ఆంధ్రప్రదేశ్ టూరిజం రంగంలో కీలక మైలురాయిగా నిలిచే విధంగా విశాఖపట్నం నుంచి అంతర్జాతీయ క్రూయిజ్ ప్రయాణం ప్రారంభమైంది. "సిటీ ఆఫ్ డెస్టినీ"గా పేరుగాంచిన విశాఖను అంతర్జాతీయ క్రూయిజ్ మ్యాప్‌పై నిలిపే ఈ ప్రయత్నం రాష్ట్రానికి గర్వ కారణంగా నిలుస్తోందని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఏపీ టూరిజం అధ్యక్షులు కె. వినయ్ మోహన్ వివరించారు. ఈ క్రూయిజ్ 14 రోజుల పాటు




సాగుతూ పర్యాటకులకు విశిష్ట అనుభవాన్ని అందించనుందని పేర్కొన్నారు. ప్రయాణం విశాఖపట్నం నుంచి ప్రారంభమై చెన్నై, ఫుకెట్, లాంగ్కావి, సింగపూర్ వంటి ప్రముఖ అంతర్జాతీయ మిగతా 8..లో

## 8 వ పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



పోషణ ప్రాముఖ్యత, ప్రధాన ఉద్దేశ్యాలపై సమావేశం.. జీవిన విధానంలో మార్పుల కొరకు ప్రభుత్వం అవగాహన పై చేపడుతున్న కృషిని వివరించిన ఎమ్మెల్యేఈరోజు అంబికా బాగ్ కళ్యాణ మండపంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషకాహార పక్వాడా ముగింపు కార్యక్రమం లో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు పాల్గొన్నారు .ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ బాలింతలకు పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న కూటమి ప్రభుత్వ ఆశయాలు కనుగంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. చిన్నారుల్లో పోషకాహారులు, చిరుధాన్యాల ప్రయోజనం వినియోగంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పోషక ఆహారాలు లో చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల విటమిన్లు, ప్రోటీన్లు లభిస్తాయని ,రక్త అభివృద్ధి, రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు జీవక్రియ మెరుగుపరచడంతో శరీరం సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎసిడిపీఓ నీలిమ గారు, అడిషనల్ సిడిపిఓ శ్రీ లత, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## బృహత్ ప్రణాళిక రహదారుల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష

- పాల్గొన్న వియంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

వియంఆర్‌డిఎ సమావేశ మందిరంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దారితీసే ప్రాధాన్యత బృహత్ ప్రణాళిక రహదారి పనుల ప్రగతిపై మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్ అంశాల వారీగా జరిపిన సమీక్షలో ప్రస్తుత పరిస్థితుల్లో తీగి కొరత ఉన్న సరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించి అనుకున్న నిర్దిష్ట సమయానికే రహదారులను పూర్తి చేయాలని, అడవివరం శొంఠ్యాం మరియు నేరేళ్ళవలస కొత్తవలస రహదారుల్లో అర్హులైన మిగిలిన యజమానులందరికీ సమన్వయంతో 1మే నాటికి పంపిణీలు పూర్తిచేయాలని, అదేవిధంగా మే 15 నాటికి అడవివరంశొంఠ్యాం రహదారిలో అసంపూర్తిగా ఉన్న కల్వర్ట్స్ నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు. బోయ పాలెం కాపులుప్పాడ రహదారి చివరి బిటుమినస్ కాంక్రీట్ లేయర్ పనులను మే మొదటి వారంలో, అదేవిధంగా అడవివరం శొంఠ్యాం రహదారి చివరి బిటుమినస్ కాంక్రీట్ లేయర్ పనులను మే రెండవ వారంలో ప్రారంభించాలని, అన్ని రహదారుల్లో మిగిలి ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా సంస్థ ఆదేశించారు. వేపగుంట పినగాడి రహదారి నిర్మాణంలో భాగంగా మిగిలిఉన్న కట్టడాలకు పరిహారాన్ని పంపిణీ పూర్తి చేయాలని, ప్రార్థన మందిరాలు మరియు ఆలయ సంబంధ సమస్యలను రెవెన్యూ శాఖ సహాయంతో పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ముఖ్య ప్రణాళీకాధికారిణి శిల్పా, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, కార్యనిర్వహక ఇంజనీర్లు దుర్గా ప్రసాద్, సుధీర్, ప్లానింగ్ అధికారులు కిషోర్, మోనిక సిబ్బంది, ప్రతినిధులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి..

- ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

ఈ నెల 28న తర్లువాడలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. గూగుల్ డేటా సెంటర్ ఏఐ హబ్ కు శంకుస్థాపన చేసేందుకు విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలన్నారు. గూగుల్ ప్రతినిధులతో, అధికార యంత్రాంగం సమన్వయం చేసుకొని పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. సంబంధిత డ్యూటీ అధికారులంతా గూగుల్ డేటా సెంటర్ ప్రాంతాన్ని పరిశీలించాలని, అక్కడి అవసరాలకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సుమారు వెయ్యి మంది కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారని, దానికి తగ్గట్లు పార్కింగ్ వసతి, తాగునీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. నిర్ణీత సమయంలోగా హెలిప్యాడ్‌ను నిర్మించాలని, తాత్కాలిక రోడ్ పనులను పూర్తి చేయాలని చెప్పారు. దుమ్మూధూళి రేగకుండా నీటిని పిచికారీ చేయాలని, ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీ చూసుకోవాలని సూచించారు. డేటా సెంటర్ ప్రాంతానికి చేరుకునే వారికి, పార్కింగ్ చేసుకునే వారికి తెలిసేలా ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా వచ్చే అవకాశం ఉన్నందున



గ్రీన్ రూమ్‌ల ఏర్పాటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్యూటీ పాసులు, వెహికల్ పాసుల గురించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని జేసీకి సూచించారు. 27వ తేదీ సాయంత్రం వీఈఆర్ సమావేశంశతాబ్ది వేడుకల అనంతరం 27వ తేదీ సాయంత్రం మిగతా 8..లో

**మొదటిపేజీ తరువాయిలు**

## ప్రతిభతో మహిళలు రాణిస్తున్నారు..

విద్యా రంగంలో మహిళల భాగస్వామ్యం, నాయకత్వ పాత్రలు పెరుగుతుండటం సంతోషకరమని అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 30 శాతానికి పైగా మహిళలు కీలక నాయకత్వ స్థానాల్లో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇంకా ఎక్కువ మంది మహిళలు వర్క్‌ఫోర్స్‌లోకి రావడమే కాకుండా ఉన్నత స్థాయి నాయకత్వ స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ, మహిళా సాధికారత లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. శతాబ్ది ఉత్సవాల్లో మహిళల పాత్రకు ఈ వనితా వేవ్ నిదర్శనమని అన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపాల్స్, డీన్స్, వార్డెన్స్, విభాగాధిపతులు వంటి కీలక బాధ్యతల్లో మహిళలు సమర్థంగా సేవలందిస్తున్నారని వివరించారు. కాళీమాత ఆలయం నుండి ఆంధ్రవిశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనను శ్రీభరత్ వీక్షించి, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా జుంబా నృత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు, యోగా ఆసనాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం నగరంలో మహిళా సాధికారతకు, యువతలో స్ఫూర్తి నింపేలా విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య పి. కింగ్, సమన్వయకర్త ఆచార్య ఏ. పల్లవి, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## యువత కష్టం... అవకాశం కలిసినప్పుడే విజయం సాధ్యం..

ఒక్కో మేళాలో సుమారు 1500 మంది యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, యువతను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. యువత జీవితంలో విజయాన్ని సాధించాలంటే కష్టం మాత్రమే కాకుండా, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం కూడా కీలకమని కలెక్టర్ అన్నారు. కష్టం.. అవకాశం కలిసినప్పుడే ఫలితం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "సిట్యుయేషనల్ అవేర్నెస్"తో ప్రతి యువకుడు అప్రమత్తంగా ఉండి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ప్రేరణనిచ్చారు. ఈ జాబ్ మేళాకు ఉత్తరాంధ్రతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత హాజరై, పలు కంపెనీల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ అవకాశాలు: గణబాబుప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. గత సంవత్సరం ఇదే వేదికపై నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా సుమారు 70 మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందజేయడం గర్వకారణమన్నారు. సాధారణంగా ఇంజినీరింగ్ కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో జరిగే నియామకాలను ప్రభుత్వ పాఠశాల స్థాయికి తీసుకురావడం విశేషమన్నారు. నియోజకవర్గంలో నిర్వహించిన జాబ్ మేళాలకు విశేష స్పందన లభించిందని తెలిపారు. గోపాలపట్నంలో తొలి మేళాకు సుమారు 3,000 మంది హాజరయ్యారని, 50కి పైగా కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు. ఐటీఐ జంక్షన్‌లో జరిగిన మేళాలో 2,108 మంది హాజరై 839 మంది ఎంపిక కాగా, తదుపరి మేళాలో 605 మందిలో 227 మంది ఎంపికయ్యారని వివరించారు. మల్కాపురంలో నిర్వహించిన మేళాలో 1,035 మంది హాజరై 419 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు, హెచ్ఆర్ బృందాల సహకారం వల్లే ఈ అవకాశాలు సాధ్యమవుతున్నాయని, వారికి, కార్యక్రమంలో భాగమైన మున్సిపల్, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. యువత నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి మూడు నుంచి నాలుగు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కష్టపడి ప్రయత్నిస్తే ప్రతి ఒక్కరికీ మంచి అవకాశాలు లభిస్తాయని గణబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఛాముండేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి అరుణ, ఇతర అధికారులు, కంపెనీల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యర్థులతో వ్యాపార సంబంధాలే ముద్దు.. వైసీపీ బలోపేతంపై శ్రద్ధ లేదాయే..!

చేయలేని దిక్కులేని స్థితిలో ఇక్కడున్న నాయకత్వం వున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి నేతల నుంచి కక్షయసాధింపు చర్యలు ఎదుర్కొంటున్న ద్వితీయ శ్రేణి నేతలకు కూడా ధైర్యం చెప్పాల్సిన స్థానిక నాయకత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ.. నాటకీయంగా ఫోటోలకు మాత్రమే ఫోజులిస్తున్నట్టు తెలుస్తోంది. 2029లో అధికారంలోకి తెచ్చేందుకు.. ప్రజల మధ్య వుండేందుకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ... కార్యక్రమాలను చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నప్పటికీ.. పార్టీలో వున్న కొందరు నేతలు మాత్రం ప్రత్యర్థి పార్టీల్లో వుండే నేతలతో కలిసి వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్వితీయ శ్రేణి నేతలను ప్రోత్సహిస్తూ.. పార్టీని బలోపేతం చేయాల్సిన ఇక్కడున్న నాయకత్వం.. అవేమీ పట్టించుకోవడం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది. కాగా, రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపునకు మాత్రం మొక్కుబడిగా కార్యక్రమాలు చేపడుతూ ఆ కార్యక్రమాల్లో మాత్రమే భాగస్వామ్యమవుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదారు నెలల్లో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశముంది. స్థానిక సమరాన్ని వైసీపీ సత్తా చాటాలంటే.. అందర్నీ కలుపుకొని పోవాల్సిన అవసరముంది. దీంతో పాటు స్థానిక సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన అవశ్యకత కూడా వున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఇక్కడ నాయకత్వానికి మాత్రం అవేమీ పట్టడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇదే విధంగా వ్యవహరిస్తే.. స్థానిక ఎన్నికల్లో ఓటమి తప్పదంటూ పలువురు చెబుతున్నారు.బలోపేతంపై దృష్టిసారించేది కొందరు మాత్రమే..వైసీపీని బలోపేతంపై దృష్టిసారిస్తూ.. ఆయా నియోజకవర్గాల్లో అత్యధికంగా కార్యక్రమాలను చేపడుతున్నది కొందరు నేతలు మాత్రమే అన్నది తెలుస్తోంది. గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌లు ఆయా నియోజకవర్గాలు, పార్టీ ఇచ్చే బాధ్యతలు పరంగా వివిధ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అధికార పార్టీని ఎండగట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గాజువాకలో స్థానిక సమస్యలపై ఆందోళన కార్యక్రమాలను చేపడుతూ.. ప్రజలకు మరింత దగ్గరవుతున్నారు తిప్పల దేవన్‌రెడ్డి. ప్రజలతో భాగస్వామ్యమవుతూ.. పార్టీ బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆ పార్టీలో వున్న కొందరు నేతలు వివరిస్తున్నారు.

## విశాఖ నుంచి అంతర్జాతీయ క్రూయిజ్ ప్రారంభం

గమ్యస్థానాలను కలుపుతుందని తెలిపారు.ప్రయాణ వివరాలు..జూలై 15న విశాఖపట్నం నుంచి ఘనంగా ప్రారంభమైన ఈ ప్రయాణం మొదట సముద్ర మార్గంలో చెన్నై చేరుకుంటుంది. అక్కడి నుంచి ప్రయాణికులు మూడు రోజుల పాటు హైసీస్‌లో నౌకలో వినోదం, విశ్రాంతి, స్పా, డెక్ స్పోర్ట్స్ వంటి సౌకర్యాలను ఆస్వాదించే అవకాశం ఉంటుంది. జూలై 22న ఫుకెట్ చేరుకున్న క్రూయిజ్, అక్కడ ఒకరోజు అదనపు నిలయం కల్పించడం ద్వారా పర్యాటకులకు ద్వీప సౌందర్యాన్ని పూర్తిగా అనుభవించే అవకాశం ఇస్తుంది. అనంతరం లాంగ్కావి, కౌలాలంపూర్ సమీపంలోని పోర్ట్ క్లాంగ్ ద్వారా ప్రయాణించి చివరగా జూలై 27న సింగపూర్ చేరుకుంటుంది. జూలై 28న తుది దిగ్విజయం (డిసెంబార్కేషన్) జరుగుతుందని ఏపీ టూర్స్ అండ్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె వినయ్ మోహన్ వివరించారు.ముఖ్య ఆకర్షణలు..చెన్నై-ఫుకెట్ మధ్య మూడు రోజుల సముద్ర ప్రయాణం ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని వినయ్ మోహన్ తెలిపారు. ఫుకెట్‌లో రెండు రోజుల విస్తృత విహారం ఉంటుందని, వీటితో పాటు నౌకలో లగ్జరీ సదుపాయాలు, వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు. దక్షిణాసియాలోని ప్రధాన పర్యాటక కేంద్రాలను ఒకే ప్రయాణంలో దర్శించే అవకాశం ఉందని తెలిపారు. పర్యాటక రంగానికి ఊతం ఈ అంతర్జాతీయ క్రూయిజ్ ప్రారంభమని, విశాఖపట్నం స్థానాన్ని దక్షిణాసియాలో ప్రముఖ సముద్ర పర్యాటక కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక అడుగు. ముఖ్యంగా సీఐఐ సమావేశం తర్వాత ప్రారంభమైన ఈ ప్రయత్నం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడనుందని వినయ్ మోహన్ వివరించారు.ప్రయాణికులకు సూచనలు..ఈ ప్రయాణంలో థాయిలాండ్, మలేషియా, సింగపూర్ దేశాలను సందర్శించే క్రమంలో పాస్‌పోర్ట్‌కు కనీసం 6 నెలల గడువు ఉండటం అవసరం. వీసా నిబంధనలు ముందుగానే తెలుసుకోవడం మంచిది. ఈ క్రూయిజ్ ప్రారంభం ఆంధ్రప్రదేశ్ టూరిజానికి ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించగా, విశాఖపట్నం అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రాముఖ్యతను సంతరించుకుందని వినయ్ మోహన్ వివరించారు.

## ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి..

నోవాటెల్ వేదికగా నిర్వహించనున్నవీఈఆర్(విశాఖ ఎకనామిక్ రీజియన్) ద్వితీయ సమావేశానికి తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లను ఆదేశించారు. సంబంధిత ప్రాజెక్టులు, ఇతర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించుకోవాలని, వివిధ కంపెనీల ప్రతినిధులు, ప్రముఖులతో జరిగే డిన్నర్ కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వీఈఆర్ లో భాగస్వామ్యమయ్యే అధికారులు, ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలన్నారు.సమావేశంలో జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు కేతన్ గార్గ్, తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీ విజయ్ మణికంఠ, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు శేషశైలజ, సంగీత్ మాధుర్ ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన..
# శాంక్టమ్ రిసార్ట్‌ని కూల్చేయండి

జరిపారంటూ స్థానికుల ఆరోపణలపై జీవీఎంసీ కమిషనర్ వాటిని తొలగించాలంటూ ఇచ్చిన ఆదేశాల్ని ఏపీటీడీసీ తక్షణమే అమలు చేయాలని న్యాయస్థానం తాజాగా ఆదేశించింది. తొట్లకొండలో ప్రాంతంలో కోస్తా నియంత్రణ మండలి (సీఆర్ జెడ్) నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన శాంక్టమ్ రిసార్టును తక్షణమే కూల్చేయాలంటే స్థానిక మహిళ వేసిన పిటిషన్ ను కోర్టు తీవ్రంగా పరిగణించి నిర్మాణాల్ని తొలగించాలని కోర్టు ఆదేశించింది. కాపులుప్పా డసర్వే నంబర్ 314లోని 24ఎకరాల విస్తీర్ణంలో ఏపీటీడీసీ చాలా కాలం క్రితం తొట్లకొండకు వచ్చే పర్యాటకుల కోసం చిన్న రెస్టారెంట్ ఏర్పాటు చేసింది. ఆ ప్రాంతం సీఆర్ జెడ్ పరిధిలో ఉండడంతో పక్కా నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం లేదు. దానిని ఏపీ టీడీసీ లీజుకిచ్చింది. లీజుదారుడి నుంచి రాజకీయ నేతలు ముగ్గురు సబ్ లీజుకు తీసుకున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఈ విషయం తెలిసినా ఏపీటీడీసీ అధికారులు లీజు రద్దు చేయలేదు. ఆ



చి న్నరెస్టారెంట్ ను సబ్ లీజుదారులు త మఇష్టారాజ్యంగా మార్చేశారు. స్విమ్మింగ్ పూల్, ఏసీ గదులు, రెస్టారెంట్ వంటివి నిర్మించి, సీఆర్ జెడ్ నిబంధనలు ఉల్లంఘించారు. ప్రభుత్వ స్థలాన్ని కూడా ఆక్రమించారు. అక్కడ మద్యం విక్రయించడానికి ఏపీటీడీసీ రాయితీ ధ ర(పర్యాటకుల కోసం)పై లైసెన్స్ తీసుకుంటే దానిని కూడా నేతలు తమ చేతుల్లో పెట్టుకుని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించారు.అడుగడుగునా ఉల్లంఘనే..ఆయా నిబంధనల ఉల్లంఘనల్ని విశాఖ ఫిషర్ విమెన్ డ్రై పిష్ కోఆపరేటివ్ సొసైటీ 2018లోనే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లింది. వారు చర్యలు తీసుకోకపోవ డంతో ఆ సంఘం హైకోర్టులో కేసు వేసింది. ఆ తరు వా తదీంతో పాటు మరికొన్ని బీచ్ రెస్టారెంట్ల నిబంధనల ఉల్లంఘనలపై జనసేన నే తపీతల మూర్తి యాదవ్ కేసులు వేశారు. తప్పులు సరిచేసుకోవాలని జీవీఎంసీ అధికారులు అనేక అవకాశాలిచ్చారు. కానీ ఏపీటీడీసీ అధికారులు పట్టించుకోలేదు. ఆయా నిర్మాణాలకు ఎవరి నుంచి అనుమతులు తీసుకున్నారో చూపించా లని కోరినా ఎటువంటి పత్రాలూ సమర్పించ లేకపో యారు. పైగా తమది ప్రభుత్వ కార్పొరేషన్ అని, నిబంధనలు తమకు వర్తించవని ఏపీటీడీసీ అధికారులు వాదించారు. ఇవన్నీ పరిశీలించిన హైకోర్టు చట్టం ముందు అంతా సమానమేనని, దానికి ఎవరూ అతీతులు కారని ప్రత్యేకంగా పేర్కొంటూ శాంక్టమ్ రెస్టారెంట్ లో అక్రమ నిర్మాణాలన్నీ తొలగించాలని గురువారం తీర్పునిచ్చింది. మూడు వారాల్లో తొలగింపు పూర్తి కావాలని జీవీఎంసీని ఆదేశించింది. ఏపీటీడీసీ ఇ కపైనైనా ఇలాంటి రుబాబు పనులు చేయకుండా, బీచ్ మార్గంలో నిబంధనలకనుగుణంగా జీవీఎంసీ వ్యవహరించాల్సి ందే.

## ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన గంటా



తెలుసుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉన్నందున భవిష్యత్ లో అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురా వచ్చని గంటా పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా పరిష్కారం కావాల్సిన అంశాలుంటే తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సబీనా, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, లొడగల వెంకట్రావు, కె.శ్రీకాంత్ రాజు, మీసాల సత్యనారాయణ, జ్ఞానేశ్వర్, కాకర రమణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులంతా వేడుకలకు సులభంగా చేరుకునేలా ప్రణాళికలు..

వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు వేదిక వద్దకు ఎలా చేరుకోవాలని, డే స్కాలర్స్, అఫిలియేటెడ్ కాలేజీల విద్యార్థులు ఎలా రావాలి అనే అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. బస్సుల రూట్ మ్యాప్, పార్కింగ్ ప్రాంతానికి ఎలా చేరుకోవాలని, విద్యార్థులు వేదిక వద్దకు ఎలా వెళ్లాలి, వారు ఎక్కడ కూర్చువాలి అనే అంశాలపై అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అందరికీ రిజిస్ట్రేషన్ చేసి పాసులు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏయూ, పోలీసు, రెవెన్యూ, డ్యూటీ అధికారులు సమన్వయం వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. జేసీ గొబ్బిళ్ల విద్యాధరి, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, ఏయూ అధికారులు పాల్గొన్నారు.

## మహిళా విద్యార్థినులకు సైబర్ సెక్యూరిటీ, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు

కిశోర్ దాసరి, లక్ష్మి ముక్కావిల్లి మార్గదర్శకత్వంలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్స్ డా. ఎం. కసులమ్మ మరియు డా. జగదీశ్వర్ రావు గార్లకు వారి సహకారం కోసం మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. అలాగే కార్యక్రమాల విజయవంత నిర్వహణలో సహకరించిన వాలంటీర్లు కరణ్, జీవన్, రవి కిరణ్, కళ్యాణ్ తదితరుల సేవలను అభినందించారు.

## విశాఖ పర్యాటకానికి రెక్కలు

ఇస్తోంది.కొనసాగుతున్న పనులు..ఆర్కే బీచ్, కైలాసగిరి, యారాడ బీచ్, అరకు లోయ వంటి ప్రదేశాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. పర్యాటకులకు మెరుగైన అనుభవం అందించేందుకు రోప్‌వేలు, వ్యూయింగ్ డెక్కులు, రిసార్టులు, వాటర్ స్పోర్ట్స్ సౌకర్యాలు అభివృద్ధి చేస్తున్నారు. క్రూయిజ్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, ఈకో టూరిజం రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ విశాఖను గ్లోబల్ టూరిజం మ్యాప్‌పై నిలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రహదారులు, పార్కింగ్, శుభ్రత, భద్రత వంటి అంశాలపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటకుల రాక పెరగడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు విస్తరించి నగర ఆర్థికాభివృద్ధికి దోహదం అవుతుందని అధికారులు తెలిపారు. విశాఖను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## ఉక్కు వీఆర్ఎస్ చెల్లింపుల్లో తీవ్ర వివక్ష!

వారికి రావాల్సిన మిగిలిన 50 శాతం మొత్తంతో పాటు, ఆర్జిత సెలవుల నగదు, బకాయి వేతనాలు కలిపి ఒక్కొక్కరికి రూ. 20 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు రావాల్సి ఉంది. ఆర్థిక పరిస్థితి బాగుపడ్డాక ఇస్తామంటూ యాజమాన్యం దాటవేత ధోరణి ప్రదర్శించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.తప్పిదాలతో పెరుగుతున్న భారం.....కోక్ ఓవెన్ మరమ్మత్తులు చేయకుండానే మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించడం వల్ల ముడి సరుకు వ్యయం 10 శాతం పెరిగిందని, దీనివల్ల పరిశ్రమ మరింత ఆర్థిక ఊబిలోకి వెళ్తోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ సొమ్ముతో అప్పులు తీర్చుకుందామని, పిల్లల చదువులు, పెళ్లిళ్లు చేద్దామని ఆశించిన తమను ఈ నిర్ణయం తీరని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని వారు వాపోతున్నారు. వారం రోజుల్లోగా 12 శాతం వడ్డీతో కలిపి తమ బకాయిలు చెల్లించకపోతే చట్టపరంగా ముందుకెళ్తామని లీగల్ నోటీసులో హెచ్చరించారు.

## మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌పై సీపీ ఆకస్మిక తనిఖీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
విశాఖపట్నం నగరంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై దృష్టి సారించిన పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కేసుల రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను సమీ క్షించారు. స్టేషన్ పరిసరాలు, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించి, సంబం ధిత అధికా రులకు తగిన సూచనలు ఇచ్చారు.నగరంలో శాంతి భద్రతలు కాపాడే దిశగా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.



## అపాయంలో ఆశాకిరణం..

### - గాయపడిన వారికి అండగా నిలిచిన ఎమ్మెల్యే గంటా

**విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**
ఒక్క క్షణంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకుల జీవితాలను తారుమారు చేసింది. నీళ్ల కుండీల జంక్షన్ వద్ద శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి ప్రాణాలతో పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పద్మనాభం మండలం కృష్ణాపురానికి చెందిన జగదీష్, రమేష్ తమ పనుల కోసం బయలుదేరిన సమయంలో, వారి రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌ను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో రోడ్డుపై పడిపోయి బాధతో విలవిలలాడారు. అదే సమయంలో అక్కడుగా వెళ్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ ఘటనను గమనించి వెంటనే స్పందించారు. క్షణం ఆలస్యం చేయకుండా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించేలా ఏర్పాట్లు చేసి, వారికి తక్షణ వైద్య సహాయం అందేలా చూసారు. "ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదు" అన్న భావనతో స్పందించిన ఆయన, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన స్థానికంగా మానవీయ స్పందనకు ఉదాహరణగా నిలిచింది. ఈ ప్రమాదం మరోసారి రోడ్డు భద్రతపై అవగాహన అవసరాన్ని గుర్తు చేస్తోంది.



## విశ్వవిద్యాలయానికి వెలుగుల పండు
## శనివారం నగరవాసులకు అవకాశం

**విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**





ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వెలుగుల పండుగ వచ్చింది. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏయూలోని ప్రతీ విభాగాన్ని, రహదారులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రివేళల్లో ఏయూ రహదారులు విద్యుత్ దీప కాంతులతో శోభలీనుతున్నాయి. ఈ నెల 27న శతాబ్ది ఉత్సవాల వేడుకలు సైతం ఘనంగా నిర్వహించడానిక అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వర్సిటీలో ప్రత్యేక నడక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరవాసులు



సైతం పాల్గొనవచ్చునన్నారు. నగరవాసులు సందర్శనార్థం ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. శనివారం నిర్వహించే కార్యక్రమంలో ఏయూ అధికారులు, విద్యార్థులు పాల్గొంటామన్నారు.

## వందేళ్లు గుర్తుండే విధంగా వేడుకల నిర్వహణ

### - ఆకట్టుకున్న బోధనేతర సిబ్బంది వేడుక - ఉత్సాహాన్ని నింపిన ఉద్యోగ ఉత్సవం

**విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**
విశ్వవిద్యాలయం ఉద్యోగాలను అందించే కేంద్రంగా నిలచేదని జిల్ల ట్రెజరీఅకౌంట్స్ కార్యాలయం డిప్యూటి డైరెక్టర్ కవిటి మోహన రావు అన్నారు. తాము ఇక్కడ విద్యార్థులుగా ఉంటూ ఉపాధి అవకాశాలను సాధించడానికి నాటి అధికారులు, గ్రంథాలయం అందించిన సహకారాన్ని గుర్తుచేసుకున్నారు. ఏయూ ప్రాశస్తం, నాటికీ, నేటికీ పెరుగుతూ వస్తోందన్నారు.జి.వి.ఎం.సి డిప్యూటి ప్రోజక్ట్ ఆఫీసర్ జి.నాగార్జున రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం తమకు విద్యను అందించడంతో పాటు, తమ జీవితాలను తీర్చిదిద్దిందన్నారు.విద్యసంబంధ అంశాలతో పాటు, క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలను శతాబ్ది ఉత్సవాలలో నిర్వహిస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. బోధనేతర ఉద్యోగులను గౌరవించడం, సత్కరించుకునే వేదికగా ఈ



కార్యక్రమం నిలుస్తోంది. తమ పరిధిలో ఉన్న ఉద్యోగులు సమస్యలు కొన్ని పరిష్కరిం చడం జరిగిందన్నారు. ప్రభుత్వ సహకారంతో ఉద్యోగాల సంక్షేమానికి కృషి చేస్తామ న్నారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణలో బోధనేతర సిబ్బంది సహకారం ఎంతో ఉంది. వారికి సభాముఖంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా నన్నారు. డిప్యూటి రిజిస్ట్రార్ సాంబమూర్తి స్వాగతోపన్యాసం తో అతిథులకు స్వాగతం పలికారు. సజీవ వారసత్వం గా, పరివర్తనాత్మక వ్యవస్థగా ఏయూ నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఏయూ అధికారులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి .


**వార్త CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ VEERA ANUSHA mother of VASA ANNAPURNA D/O VASA SUDHIR KUMAR previously called DANGETI ANNAPURNA R/O D.NO. 39-33-104/6/2, FLAT NO. 102, SRI SAI VILLA, MADHAVADHARA VUDA COLONY, VISAKHAPATNAM now changed my daughter surname from DANGETI ANNAPURNA to VASA ANNAPURNA. Henceforth my daughter will be called as VASA ANNAPURNA for all purposes. (Ro.No.3157)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# 'గ్రేటర్' సౌత్ జోన్‌లో నేటి నుంచి ప్రత్యేక ట్యాక్స్ మేళాలు

(ప్రభాతవార్త–విశాఖపట్నం)



జీవీఎంసీ సౌత్ జోన్ పరిధిలో ఆస్తి పన్ను సేవలను ప్రజలకు మరింత సులభంగా, వేగవంతంగా అందించేందుకు ప్రత్యేక రెవెన్యూ (ట్యాక్స్) మేళాలు నిర్వహించను న్నారు. ఈ మేళాలు శనివారం నుంచి 30 వరకు కొనసాగనున్నట్లు జీవీఎంసీ సౌత్ జోన్ జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు తెలిపారు. ఈ మేళాల్లో కొత్త ఆస్తి పన్ను అసెస్‌మెంట్, యాజమాన్య మార్పిడి (మ్యూటేషన్), భవన మార్పులు లేదా అదనపు నిర్మాణాల నమోదు, ఆస్తి విభజన, రివిజన్ పిటిషన్లు వంటి సేవలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించబడతాయి. ప్రజల సౌకర్యార్థం సౌత్ జోన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ పత్రాలు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్ (ఈసీ), ఆధార్ ప్రతులు, లింక్ డాక్యుమెంట్లు మరియు అవసరమైన ఇతర ధృవపత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఈ మేళాల నిర్వహణలో జోనల్ కమిషనర్ అధ్యక్షతన రెవెన్యూ ఆఫీసర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆస్తి పన్ను సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

# ఆనందపురం ఎంపిడీవోకు ఉత్తమ ఉద్యోగి అవార్డు

ఆనందపురం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఆనందపురం ఎంపిడీవో వి. జానకి సేవలను గుర్తిస్తూ ఉత్తమ ఉద్యోగి అవార్డుని జిల్లా ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం జిల్లా అధికారులు, జెడ్పీ చైర్ పర్సన్ చేతులు మీదుగా అవార్డుని బహుకరించారు. ఉపాధి కల్పన, 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగం, వివిధ ప్రభుత్వ పథకాలను అమలు చెయ్యడంలో ముఖ్యపాత్ర వహించిన అధికారినిగా గుర్తించి ఉత్తమ అవార్డు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిని జానకి మాట్లాడుతూ సహచర ఉద్యోగుల సహకారం లేకపోతే ఈ అవార్డు వచ్చి ఉండేది కాదని, దీంతో తనపై పై మరింత భాద్యత పెరిగిందన్నారు. ఇకపై మరింత జాగ్రత్తగా ఉద్యోగ భాద్యతలు నిర్వహిస్తానని ఎంపీడీవో జానకి చెప్పారు.

# పెద్దిపాలెంలో పంచాయతీరాజ్ దినోత్సవం

ఆనందపురం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



ఆనందపురం మండలంలోని పెద్ది పాలెంలో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మరిపిల్ల చిన్నయ్య పాత్రుడు మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యానికి పునాది అయిన పంచాయతీ రాజ్ వ్యవస్థ దేశ సమగ్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు మరింత సమర్థవంతంగా అందించాలంటే పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యావేత్త బి. రాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు నిబద్ధతతో, సేవాభావంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడిలోవ చానల్ వైస్ చైర్మన్ ముదిలి చిన్నయ్య పాత్రుడు, కూరాకుల రమేష్, నాగరాజు, అముజూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# విధినిర్వహణలో ప్రతిభకు గుర్తింపు

## -మల్కాపురం సీఐ గొలగాని అప్పారావుకు రివార్డు

గాజువాక,ఏప్రిల్ 24,ప్రభాతవార్త



విధినిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన మల్కాపురం సీఐ గొలగాని అప్పారావును నగర్ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. శుక్రవారం నగర పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఏప్రిల్ నెల నేర సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేసే అధికారులకు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు.

నెలవారీ నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో చురుకైన పాత్ర పోషించినందుకు గాను సీఐ అప్పారావుకు సీపీ చేతుల మీదుగా నగదు రివార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలువురు ఉన్నత పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

## కలెక్టర్ అభిషిక్త కిషోర్

గోపాలపట్నం, ఏప్రిల్ 24,ప్రభాతవార్త



చదువుతో పాటు వృత్తి విద్య కోర్సులలో నైపుణ్యం సంపాదించి తద్వారా యువత సైతం చిన్న అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని విశాఖ కలెక్టర్ ఎం.అభిషిక్త కిషోర్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం నియోజకవర్గ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ పి.గణబాబు నేతృత్వంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. 68 సంస్థలు ఈ జాబ్ మెలలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించగా సుమారుగా 1700 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరిలో 785 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ బంగారు భవిష్యత్తు కోసం విద్యార్థులు దిశా నిర్దేశం చేసుకొని అంకితభావంతో సాధన చేస్తే తప్పకుండా సత్ఫలితాలను సాధించగలుగుతారని అన్నారు. గణబాబు మాట్లాడుతూ ఈరోజు అర్హత సాధించలేని విద్యార్థులు నిరుత్సాహ పడకుండా లోపాలను సరిదిద్దుకొని తద్వారా భవిష్యత్తులో విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ ఎస్ డి సి అధికారులు చాముండేశ్వరరావు, రమేష్, జోనల్ కమిషనర్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

# పద్మనాభంలో ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

పద్మనాభం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



పద్మనాభం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ కె.రాంబాబు ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంను అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాంబాబు, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్ కె నాయుడు గతంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా ఎటువంటి అభివృద్ధి పనులు జరిగాయి, ఎన్ని శాఖలు పనిచేసేవి అని యువ ఉద్యోగులకు వివరించారు.ముందుగా జాతిపిత గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం బాందేవుపురం మాజీ ఎంపీటీసీ సిమ్మప్ప,సన్యాసినాయుడు దంపతులను సత్కరించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జయుమ, అధికారులు పాల్గొన్నారు.

# అమెజాన్ ఇండియా భారీ పెట్టుబడులు

ఆరిలోవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

అమెజాన్ ఇండియా తన సంస్థలో పనిచేసే అసోసియేట్ల భద్రత, ఆరోగ్యం, ఆర్థిక శ్రేయస్సు కోసం తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భారతదేశంలో అత్యంత సురక్షితమైన, వేగవంతమైన, అత్యంత నమ్మకమైన ఆపరేషన్స్ నెట్‌వర్క్‌ను నిర్మించే లక్ష్యంతో సుమారు ఐఎన్ఆర్ 2800 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డిజిటలైజేషన్, దేశీయ ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధి, పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాల కల్పన. దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు తమకు కావాల్సిన వస్తువులను నిమిషాలు, గంటలు, రోజుల వ్యవధిలోనే అత్యంత వేగంగా చేరవేసేందుకు వీలుగా అమెజాన్ తన కోర్ బిజినెస్‌తో పాటు క్విక్ కామర్స్ విభాగాలను నిరంతరం విస్తరిస్తూనే ఉండటం అని, ఈ ప్రయత్నాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో, ఈ ఏడాది మేము ఐఎన్ఆర్ 2800 కోట్లు భారీ పెట్టుబడిని కేటాయిస్తున్నామని, ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన వంటి ప్రతిష్టాత్మక పథకాల స్ఫూర్తితో, మా అసోసియేట్లకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడంతో పాటు వారిని ఆర్థిక సమ్మిళిత వ్యవస్థలో భాగస్వాములను చేయడానికి ఈ నిర్ణయాలు ఎంతగానో తోడ్పడతాయి" అని అమెజాన్ ఇండియా మరియు ఆస్ట్రేలియా, ఆపరేషన్స్ – వైస్ ప్రెసిడెంట్, అభినవ్ సింగ్ వివరించారు.

# కష్టపడే కార్యకర్తలకు వైకాపాలో గుర్తింపు

## ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరదేశికి సన్మానం-మాజీ మంత్రి బాలరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దేవన్ రెడ్డి

గాజువాక,ఏప్రిల్ 24,ప్రభాతవార్త



పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సముచిత గౌరవం లభిస్తుందని మాజీ మంత్రి బాలరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తిప్పల దేవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో 75వ వార్డు అధ్యక్షుడు గొందేసి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మారేడు పూడి పరదేశిని వారు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పార్టీ స్థాపన నుంచి కష్టపడుతున్న వారికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తగిన గుర్తింపునిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పదవులు బాధ్యతను పెంచుతాయని, పరదేశి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, గొందేసి వెంకటరమణారెడ్డి, సుమన్ రెడ్డి, ములకలపల్లి వెంకటేష్, కాకినాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్ట్‌వర్తీ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ రిపోర్టును విడుదల చేసిన అమెజాన్

ఆరిలోవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

అమెజాన్ తన మొట్టమొదటి ట్రస్ట్‌వర్తీ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ రిపోర్టును విడుదల చేసింది. పార్టనర్లు వివిధ బ్రాండ్ల ప్రయోజ నకిలీ ఉత్పత్తుల నియంత్రణ, ఉత్పత్తుల భద్రత, స్కామ్‌ల నివారణ, నమ్మదగిన రివ్యూలు ఆర్గనైజ్డ్ రిటైల్ క్రైమ్ వంటి అంశాలపై అమెజాన్ చేస్తున్న కృషిని ఈ నివేదిక మొదటిసారిగా ఏకీకృతం చేసింది. ఈ సందర్భంగా వరల్డ్ వైడ్ కస్టమర్ అండ్ పార్ట్‌నర్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ రోహన్ ఉమెన్ ఈ నివేదికపై మాట్లాడుతూ.. వినియోగదారులు, బ్రాండ్లు, విక్రేతలందరికీ తమ స్టోర్‌ను అత్యంత సురక్షితంగా ఉంచడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకే అమెజాన్ అకౌంట్ హెల్త్ డ్యాష్‌బోర్డ్ వంటి అత్యాధునిక సాధనాల్లో పెట్టుబడులు పెట్టామని, ఇది విక్రేతలకు తమ పాలసీలు, పనితీరు లక్ష్యాలు నిబంధనల పాటించడంలో పారదర్శకతను, నియంత్రణను కల్పిస్తుందని వివరించారు. నిజాయతీగా వ్యాపారం చేసే భాగస్వాములు అమెజాన్‌లో విజయవంతంగా రాణించేలా చూడటమే తమ మిషన్ అని, ఈ నివేదిక తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆరిలోవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక పదో వార్డు వెటర్నరీ కాలనీలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి టెంపుల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెలగపూడి ప్రతాపరుద్ర, వార్డు మాజీ కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్, 38వ వార్డు మాజీ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో రోగికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి రోగికి తగ్గట్టుగా మందులను అందజేశారు. అదేవిధంగా సుందర్ నగర్ లో వివిఎమ్ఆర్ మార్ట్ ఉ ఆయిల్స్ అండ్ జనరల్స్ ఉ ఐస్క్రీమ్ షాప్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, వేమల వెంకట రావు, యువత అధ్యక్షులు కర్రీ ప్రకాష్ రావు, క్లస్టర్ ఇంచార్జ్ మద్దిల రాజేష్, యూనిట్ ఇంచార్జిలు బూత్ కన్వీనర్స్, చనుమూల్ శ్రీనివాసరావు, కర్రీ వెంకట్రామారావు బుగత తాతారావు, కాళ్ళ శ్రీనివాస్, బోలె రమణ, ధనలక్ష్మి , గురునాథరావు తోపాటు సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# ఎం.డి నజీర్‌కు ముస్లిం సోదరులు ఘన సత్కారం

ఆరిలోవ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు గా నియమితులైన ఎం.డి నజీర్‌కు ఆరిలోవ ముస్తఫా మసీద్ కమిటీ సభ్యులు, ముస్తఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. మైనారిటీకి చెందిన ఎండి నజీర్‌ను జాతీయ ఉపాధ్యక్షునిగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ పరంగా ముస్లిం సోదరులకు అన్నివిధాల అండదండలు అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా నజీర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ యాసిన్ బాబా, సెక్రట్రీ మహ్మద్ తాజ్, షేక్ శుభాని, అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ ఖాలేషా, సెక్రటరీ అక్బర్ అలీ, కమల్ భాషా,షేక్ సర్దార్,షేక్ భాషా, మసీద్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఆల్ సైన్స్ లా కాలేజ్ విద్యార్థులు

ఆరిలోవ, ఏప్రిల్24, ప్రభాతవార్త



అల్ సెయింట్స్ క్రిస్టియన్ లా కాలేజ్ న్యాయ విద్యార్థులు శుక్రవారం విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. వీరికి జైల్ ఉప పర్యవేక్ష ణాధికారి సిహెచ్ రాజశేఖర్ జైల్ వాతావరణాన్ని, వారికి అందించే సదుపాయాలను, భోజన వసతులు, బేరాక్స్ వివరాలు లా విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా లా విద్యా ర్థులు అడిగిన సందేహాలకు సమాధానమిచ్చారు. జైల్ అనే సినిమాలలో చూపించేలా ఫనిష్మెంట్ కు కాదని, ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకురావడానికి మాత్రమేనని తెలియజేశారు. జైలు సందర్శన ద్వారా న్యాయ పరమైన, ఖైదీల జీవన ప్రమాణాలను క్షుణ్ణంగా తెలుసుకున్నామని లా విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో లా కళాశాల ప్రిన్సిపల్ నీరజ, వైస్ ప్రిన్సిపల్ గణేష్, ప్రొఫెసర్ విక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ.. న్యాయ విద్యార్థులకు జైలు విజిట్ ..జైలు విజిట్ అద్భుతమన్న విద్యార్థులు..

మనం సినిమాలో చూసిన జైలు వేరు..నిజ జీవితంలో ఉండే జైలు వేరని డిప్యూటీ జైలర్ సి హెచ్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. అల్ సెయింట్స్ క్రిస్టియన్ లా కాలేజ్ న్యాయ విద్యార్థులకు జైలు విసిట్ సందర్భంగా జైలు అంతా కూడా విద్యార్థులకు చూపించారు.. జైల్లో ఉండే ఖైదీలకు సంబంధించి వారు ప్రవర్తించే విధానం, జైల్లో ఖైదీలకు పెట్టే భోజనం, ఖైదీలు ఉండే బ్లాక్ వారు తయారు చేసే వస్తువులు వీటిపై పూర్తి విషయాలను క్షుణ్ణంగా విద్యార్థులకు తెలియపరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ జైలులో ఉన్న బ్లాకులు తదితర విషయాలకు సంబంధించి క్షుణ్ణంగా చెప్పటం జరిగింది. జైలు అంటే కేవలం సినిమాల్లో చూపినట్టు పనిష్మెంట్ కాదని ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకు రావటమే తమ ప్రధాన విధి నిర్వహమని రాజశేఖర్ రెడ్డి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఖైదీలకు వడ్డించే భోజనాన్ని రుచి చూసి దానిపైన ఫీడ్బ్యాక్ ను సైతం బుక్కులో రికార్డు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్ సైన్స్ లా కాలేజ్ విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపల్ నీరజ, వైస్ ప్రిన్సిపల్ గణేష్,ప్రొఫెసర్ విక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గాజువాక,ఏప్రిల్ 24,ప్రభాతవార్త



గాజువాక పోలీస్టేషన్ పరిధి సుందరయ్య కాలనీలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, వివరాల కోసం ఆరా తీశారు. మృతుడి ఆచూకీ లభించకపోవడంతో పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింహాచలం నాయుడ్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం

మాధవధార, ఏప్రిల్ 24 ప్రభాతవార్త



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎల్. సింహాచలం నాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా తాటిచెట్లపాలెం–కప్పరాడ రహదారిపై, ఎన్ ఎ డి జంక్షన్ సమీపంలో వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ఆయనను తక్షణమే అంబులెన్స్ ద్వారా కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఉదయం 4 గంటల ప్రాంతంలో ఆయన మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఎక్సైజ్ మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి రూ.50,000 వ్యక్తిగత సహాయం ప్రకటించారు. అదేవిధంగా అంత్యక్రియలు, కాంపాషనేట్ ఉద్యోగం, పెన్షన్ ప్రయోజనాలు త్వరితగతిన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ చామకూరి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ కూడా సంతాపం వ్యక్తం చేస్తూ తలో రూ.30,000 చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. అదనంగా ఉద్యోగుల సంఘాలు కూడా స్వచ్ఛందంగా సహాయం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. బీమా పథకాలు, ఎస్బీఐ జీత ప్యాకేజీ ద్వారా లభించే ప్రయోజనాలను త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా హెల్మెట్‌ను సరిగ్గా ఉపయోగించాలని అధికారులు సూచించారు. హెల్మెట్ ధరించినప్పటికీ ఈ ప్రమాదం ప్రాణాంతకమవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సింహాచలం నాయుడు కర్తవ్యనిరతితో పనిచేసే అధికారి అని సహచరులు గుర్తుచేసుకుంటూ, ఆయన కుటుంబానికి ఈ కష్ట సమయంలో శాఖ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని తెలిపారు.

# న్యాయవిద్యలో విలువలతో ముందుకు..సమిష్టి కృషితో విజయ శిఖరాలు

## ఎన్.బి.ఎం న్యాయ కళాశాల డీన్ డా.డీ.వి. రమణ - పూర్వుల పునాది..భవిష్యత్‌కు బలమైన దిశగా ఎన్‌బీఎం ప్రస్థానం - ప్రిన్సిపాల్ డా. బి. గాయత్రి -ఎన్‌బీఎం న్యాయ కళాశాల ఘన విజయోత్సవం -ఐదు ప్రతిష్టాత్మక అవార్డులతో మెరిసిన విద్యాసంస్థ -ఏయూ శతాబ్ది వేడుకల్లో ఉత్తమ అనుబంధ కళాశాలగా గుర్తింపు

విశాఖపట్నం,ఏప్రిల్ 24, ప్రభాతవార్త




రాష్ట్రంలో న్యాయ విద్యకు దిక్సూచి అయిన ఎన్‌బీఎం న్యాయ కళాశాల మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉత్తమ అనుబంధ కళాశాలగా ఎంపిక కావడంతో పాటు మొత్తం ఐదు ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకోవడం విశేషంగా నిలిచింది.1985లో విశాఖపట్నంలో స్థాపించబడిన ఈ కళాశాల, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో న్యాయ విద్యాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తూ వేలాది మంది విద్యార్థులను న్యాయవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. శతాబ్ది వేడుకలలో భాగంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల డీన్ డా. డీ.వి. రమణకు దీర్ఘకాలం ప్రిన్సిపాల్‌గా సేవలందించినందుకు ప్రత్యేక అవార్డు లభించగా, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డా.ఎం. సత్యసాగర్‌కు ప్రతిభావంత ఉపాధ్యాయ అవార్డు దక్కింది. విదేశాంగ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా సేవలందిస్తున్న డా.వై.ఉమాశంకర్‌కు విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు, తుది సంవత్సరం విద్యార్థిని జి.హిమబిందుకు ప్రతిభా విద్యార్థి అవార్డు ప్రదానం చేశారు.ఈ విజయాన్ని పురస్కరించుకుని సీతమ్మ ధారలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ డా. బి. గాయత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అవార్డు గ్రహీతలతో పాటు కళాశాల అభివృద్ధికి పునాది వేసిన పూర్వ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.సన్మానితులలో డా.ఎస్.వి. జోగారావు, డా. కేసవరావు, డా.భవానీ ప్రసాద్ పాండా, డా.ఆర్. అనితారావు, డా.పి. శ్రీదేవి, డా.రాఘవయ్య, డా.కె. సీతా మణిక్యం, శైలజ, డా.కె. బాబ్జీ, డా.ఏ.అంజనేయులు, డా.ఏ.వెంకటరావు ఉన్నారు. డీన్ డా.డీ.వి.రమణ మాట్లాడుతూ, "ఎన్‌బీఎం న్యాయ కళాశాల గత 40 సంవత్సరాలుగా న్యాయ విద్యలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది. పూర్వ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల సమిష్టి కృషి, విద్యార్థుల ప్రతిభతో ఈ విజయాలను అందుకున్నాం. న్యాయవిద్యలో విలువలు, నైతికత అత్యంత కీలకం. సమాజానికి న్యాయం చేయగల న్యాయవాదులుగా విద్యార్థులు ఎదగాలి" అని అన్నారు.అలాగే కళాశాల 1985--2026 మధ్య సాధించిన ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, "3 సంవత్సరాల ఎల్.ఎల్.బి., 5 సంవత్సరాల ఎల్.ఎల్.బి. కోర్సుల ద్వారా 5000కు పైగా న్యాయవాదులను తయారు చేశాం. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో 5 గురు పూర్వ విద్యార్థులు న్యాయ మూర్తులుగా సేవలందిస్తున్నారు. 50కి పైగా పూర్వ విద్యార్థులు న్యాయమూర్తులు, ప్రాసిక్యూటర్లు, న్యాయ వేత్తలుగా కీలక స్థానాల్లో ఉన్నారు. క్రిమినల్ లా, ఇంటర్నేషనల్ లా విభాగాల్లో ఎల్.ఎల్.ఎం. పూర్తి చేసిన 30కి పైగా పూర్వ విద్యార్థులు దేశవ్యాప్తంగా న్యాయ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా సేవలందిస్తున్నారు" అని వివరించారు.ప్రిన్సిపాల్ డా.బి.గాయత్రి మాట్లాడుతూ "కళాశాల అభివృద్ధికి పునాది వేసిన పూర్వుల కృషి వల్లే ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నాం. ఈ విజయాన్ని మరింత బాధ్యతగా భావించి భవిష్యత్తులో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాం" అని తెలిపారు. న్యాయవేత్తలు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాశాల విజయాన్ని హర్షాతిరేకంతో అభినందించారు.

# మునగపాకలో అంగరంగ వైభవంగా కొత్త మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం

విశాఖపట్నం–ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా, మునగపాక మండలం, మునగపాక పేటకట్టు మూల సంఘం పరిధిలో ఈ రోజు కొత్త మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం మరియు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించ బడింది. సంప్రదాయ పద్ధతుల్లో కోలాటాలు, సన్నాయి మేళాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమాలు నిర్వహిస్తూ ఆలయ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ యువ నాయకులు కర్రి సాయికృష్ణ గారి సహాయ సహకారాలు తో పేటకట్టు మూల సంఘానికి చెందిన రైతుల పర్యవేక్షణలో ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. ఆలయ నిర్మాణానికి సహకరించిన కర్రి సాయికృష్ణ గారికి పేటకట్టు మూల సంఘం రైతులు , గ్రామస్తులు సాలువ తో సత్కరించి అందరు కృతజ్ఞతలు తెలియజేసారు. మునగపాక గ్రామం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి శ్రీ శ్రీ కొత్త మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరై అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక వికాసానికి ఈ ఆలయం ఒక కేంద్రంగా నిలుస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గంటా

విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై నియోజకవర్గం ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. మౌలిక సమస్యలు పరిష్కరించాలని పలువురు ఆయన్ను కోరారు. పీఎం పాలెంలో వైసీపీ నాయకుడొకరు తమ భూమి ఆక్రమించి బెదిరిస్తున్నారని ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఫ్లాట్ విక్రయిస్తానని అడ్వాన్స్ తీసుకుని కానిస్టేబుల్ మోసం ఒక కుటుంబం ఎమ్మెల్యేకు మొర పెట్టుకుంది. ఈ రెండు విషయాలను సీరియస్ గా తీసుకుని పరిష్కరించాలని పోలీస్ అధికారులకు చెప్పారు. కొండవాలు ప్రాంతంలో తల దాచుకోవడానికి 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న రేకుల షెడ్లు శిథిలమైపోయాయని.. మరమ్మత్తులకు సింహాచలం దేవస్థానం అనుమతి ఇవ్వని కారణంగా కూలిపోయే స్థితికి చేరుకున్నాయని వరాహగిరి కాలనీ వాసులు గంటా దృష్టికి తీసుకువచ్చారు. భీమిలి నియోజకవర్గంలో అనేక కంపెనీలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని ఇద్దరు యువకులు కోరారు. పరిష్కార వేదికలో చేసిన ఫిర్యాదులకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపించాలని సిబ్బందికి సూచించారు.

# ప్రకృతి సేద్యానికి శబల పండుగతో కొత్త ఊపు

విశాఖపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:



విశాఖపట్నంలో నిర్వహించిన 'శబల భోజనాల పండుగ' ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం కలిగించే వేదికగా నిలిచిందని ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రెంట్ అధ్యక్షులు ఎంఆర్ఎస్ వర్మ వివరించారు. శ్రీ వరాహ నృసింహస్వామి గోశాలలో ఐదు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారని తెలిపారు. రసాయన వ్యవసాయం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సుభాష్ పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. గో ఆధారిత సాగు, సేంద్రియ ఆహార ప్రాముఖ్యతను నిపుణులు వివరించారు. సుమారు అర్ధలక్ష మందికి సేంద్రియ భోజనాలు వడ్డించడం విశేషం. ప్లాస్టిక్ వినియోగం లేకుండా, ఆహార వృథా లేకుండా పర్యావరణహితంగా కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర సంప్రదాయ కళలు, దేశీ ఆవుల ప్రదర్శన కూడా సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ పండుగ ద్వారా ఆరోగ్యకరమైన జీవనం, ప్రకృతి సేద్యంపై ప్రజల్లో అవగాహన పెరిగింది.

# వేసవి సెలవుల్లో దొంగతనాలపై ప్రత్యేక నిఘా
## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, ఏప్రిల్ 24,ప్రభాతవార్త



వేసవి సెలవుల సమయంలో అనేక కుటుంబాలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే నేపథ్యంలో, ఖాళీగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న కొన్ని దొంగతన ఘటనలను దృష్టిలో ఉంచుకుని, పోలీసులు ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే దొంగతనాలను పూర్తిగా నివారించవచ్చని ఆయన సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా సూచనలు చేశారు. ఇళ్లలో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులు ఉంచకుండా, బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి. ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే, మీ ఇంటి వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడుతుంది అన్నారు. ఇంటి తలుపులు, కిటికీలు సరిగా లాక్ చేశారో లేదో నిర్ధారించుకోవాలని, అవసరమైతే ఆటోమేటిక్ లాకింగ్ సిస్టమ్ లేదా అలారం వ్యవస్థలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఇంటి బయట నిద్రించే వారు ఆభరణాలు ధరించకుండా ఉండటం మంచిదన్నారు. ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదని, మీ అప్రమత్తతే మీ ఆస్తికి రక్షణని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు.

# ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు
## పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

అనకాపల్లి ఏప్రిల్ 24,ప్రభాతవార్త



జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు శుక్రవారం స్థానిక మండల సమావేశ హాల్లో ఘనంగా నిర్వహించారు. భారతదేశంలోని గ్రామీణ పరిపాలనకి సంబంధించిన పంచాయితీరాజ్ వ్యవస్థకి 73వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ బద్ధత లభించిన ఏప్రిల్ 24న ప్రతి సంవత్సరం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటారు. అందులో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, పంచాయితీ పరిపాలనలో ప్రతిభ కనబరచిన అధికారులను, కార్యాలయ సిబ్బందిని, గ్రామాలలోని ప్రజల ఆరోగ్యాల సంరక్షణలో కీలకమైన పాత్ర పోషించే పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. జిల్లా గ్రామ పంచాయితీ అధికారి ఇ.సందీప్ , డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ అధికారిణి యస్.మంజులా వాణి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణి ఆశాజ్యోతి ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తదుపరి భారతదేశం ప్రధాని నరేంద్ర మోడీ సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం మాట్లాడిన మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణి ఆశాజ్యోతి అందరికి జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, సత్కారం అందుకోబోతున్న వారందరికి అభినందనలు తెలిపారు. డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ అధికారిణి . మంజులా వాణి మాట్లాడుతూ పంచాయితిరాజ్ వ్యవస్థలో వస్తున్న సంస్కరణలను తెలుపుతూ, వనరుల యొక్క ప్రాధాన్యతను తెలిపారు. జిల్లా గ్రామ పంచాయితీ అధికారి ఇ.సందీప్ మాట్లాడుతూ పంచాయితీరాజ్ యొక్క ఆవిర్భావాన్ని, ప్రాధాన్యతని తెలియజేస్తూ, అందులో అధికారుల నుండి పారిశుధ్య కార్మికుల వరకు గల ప్రాధాన్యాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తర్వాత స్థానికంగా ఉండే గ్రామీణ ప్రభుత్వాలుగా పంచాయితీలు మనకు ఎలా సేవ చేస్తున్నాయో వివరించారు. ప్రసంగాల అనంతరం అనకాపల్లి మండలం నకు చెందిన పంచాయితీ డెవలప్మెంట్ ఆఫీసర్లు ఈశ్వరరావుని, నాగేశ్వరరావుని, జగదీశ్‌ని, నాగలక్ష్మిని, సంతోషిని సత్కరించారు.

# ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

కసింకోట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త



కసింకోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షులు కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, ఎంపీడీవో సిహెచ్ చంద్రశేఖర రావు, డిప్యూటీ ఎంపీడీవో తోటరావ్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఎనర్జీఎస్ ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జెడ్పిరెడ్డి తుని పంచాయతీలో డిప్యూటీ ఎంపీడీవో తోటారావు ఆధ్వర్యంలో, అచ్చర్ల గ్రామపంచాయతీలో మండల వ్యవసాయ అధికారిని స్వప్న ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నయనం శెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : డి.ఎస్.పి ఎం శ్రావణి

అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 25, ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎందుకు ప్రజలు కూడా సహకరించాలని డిఎస్పి ఎం శ్రావణి అన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీస్, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో ముందడుగు వేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కీలక ప్రాంతాల్లో అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి , ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణ , మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లీలా ప్రసాద్ , నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సంయుక్తంగా పాల్గొన్నారు. ?అధికారుల బృందం ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. నూకాంబిక ఆలయ ఆర్చి జంక్షన్, ?శారదా నది బ్రిడ్జి ప్రాంతం కొత్తూరు జంక్షన్ తదితరు ప్రాంతాలను పరిశీలించారు. గతంలో జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, ఆయా జంక్షన్ల వద్ద ఉన్న లోపాలను అధికారులు గుర్తించారు. జంక్షన్ల వద్ద సిగ్నల్ వ్యవస్థ, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటుపై అధికారులకు డీఎస్పీ పలు సూచనలు చేశారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పాదచారుల భద్రత కోసం తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేశారు. డీఎస్పీ శ్రావణి మాట్లాడుతూ ప్రజల ప్రాణరక్షణే ధ్యేయంగా ఎస్పీ సూచనల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని, హైవేపై ప్రయాణించే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# శ్రీ సత్య సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ

గొలుగొండ ఏప్రిల్ 24, ప్రభాతవార్త



ఏ ఎల్ పురం ఇండియన్ బ్యాంక్ సమీపంలో శ్రీ సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ.. పులిహోర పంపిణీ నిర్వహించారు. సత్యసాయి బాబా వారి ప్రత్యేక పూజ అనంతరం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో పాదచారులకు ఈ వితరణ కార్యక్రమం ద్వారా మజ్జిగ పులిహోర అందజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

గొలుగొండ ఏప్రిల్ 24, ప్రభాతవార్త



జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాలకు అందే సేవలు పై వివరించారు. జాతీయ పంచాయితీరాజ్ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యత అమలు జరిగే విధానంపై ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని టిడిపి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా క్లాత్ మిత్రాలను సత్కరించి నిత్యవసర సరుకులను అందజేశారు. మండల మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులను సత్కరించారు. ఈ సందర్భంగా 19 పంచాయతీలకు చెత్త సేకరణకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. మహిళలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఐకెపి ఏపీఎం కరుణానిధి, ఏపీ సూర్య మణి, మండల పరిషత్ టైపిస్ట్, పంచాయతీ డెవలప్మెంట్ అధికారి, గుండుపాల కార్యదర్శి లను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి,ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, ఏవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో రమణమూర్తి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ , జన సేన మండల అధ్యక్షులు గండెం దొరబాబు, పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, క్లాప్ మిత్రాలు పాల్గొని యున్నారు.

# బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌తో ఎంవిఆర్ భేటీ

అనకాపల్లి ఏప్రిల్ 24, ప్రభాతవార్త



బీజేపీ అగ్రనేతలను కలిసే క్రమం లో భాగంగా, అనకాపల్లి జిల్లా బీజేపీ ముఖ్య నాయకులు ఎంవిఆర్ ట్రస్ట్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఢిల్లీలో బీహార్ గవర్నర్, ప్రముఖ జాతీయ నాయకులు ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీ సందర్భంగా, ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు ఎంవిఆర్ శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. దేశ రాజకీయాల్లో రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఖాన్ అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.దీనిలో భాగంగా, ప్రస్తుత రాజ కీయ పరిణామాలు, పార్టీ అభివృద్ధిపై వీరిద్దరి మధ్య సుదీర్ఘ చర్చలు జరిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం.ప్రజల వద్దకు పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లే విధానాలు వంటివి చర్చించారు. రాబోయే సుదీర్ఘ పార్టీ కార్యక్రమాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చిం చారు.ఈ మేరకు ఎం వి ఆర్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలు పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ప్రత్యేకంగా కొనియాడారు. నిజాయితీగా పని చేసే నాయకులకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది అని ఎం.వి.ఆర్ ను ఖాన్ అభినందించారు.దేశం కోసం, ధర్మం కోసం నిరంతరం శ్రమిస్తున్న అగ్రనేతల మార్గదర్శకత్వంలో పనిచేయడం నా అదృష్టమని ఎం వి ఆర్ తెలియజేసారు.రాబోయే కాలంలో పార్టీ అభివృద్ధికి మరింత శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ భేటీతో ఎం.వి.ఆర్ అనుచరుల్లో బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# అచ్చుతాపురం మండలంలో అభివృద్ధి జోరు
## -ఎమ్మెల్యే చేతుల మీదుగా పనుల ప్రారంభం

అచ్చుతాపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త



అచ్చుతాపురం మండలంలోని రామన్న పాలెం పంచాయతీ పరిధిలోని చోడపల్లి రెవెన్యూ గ్రామాలలో అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ (ఎమ్ఐజీ) లే అవుట్‌లో రూ.7.30 కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ డ్రైన్లు, కల్వర్టులు, క్వారీ రోడ్ల నిర్మాణానికి నియోజక వర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యేగా తనకు కల్పించిన అవకాశాన్ని ప్రజల అభ్యున్నతికి వినియోగిస్తూ, నియోజకవర్గం మొత్తాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. చోడపల్లి రెవెన్యూ గ్రామాలలో చేపడుతున్న ఈ సీసీ డ్రైన్లు, కల్వర్టులు, క్వారీ రోడ్ల నిర్మాణ పనులు ప్రాంతీయ మౌలిక సదుపాయాల మెరుగుదలకు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. రూ.7.30 కోట్లతో ఈ పనులకు శ్రీకారం చుట్టడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు గౌరవం..
## కీలక పదవులు ఇచ్చి గౌరవించిన ఘనత టీడీపీదే : బీసీ నేతలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



బీసీలను గుర్తించి వారికి కీలకమైన పదవుల్లో కూర్చుండి పెట్టిన ఘనత టిడిపికే దక్కుతుందని ఈ విషయాన్ని ప్రతిపక్షాలు తెలుసుకోవాలని పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి ఎప్పటినుంచో కట్టుబడి ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీనే అని అన్నారు. బీసీలను గుర్తించి ఎమ్మెల్యే, ఎంపీ వంటి కీలక పదవులు ఇచ్చి గౌరవించిన ఘనత టీడీపీదేనని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే బీసీలకు రాజకీయంగా 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, రాజ్యాధికారంలో భాగస్వామ్యాన్ని కల్పించిందని తెలిపారు. ఆధరణ పథకం ద్వారా బీసీ వర్గాల సంప్రదాయ వృత్తులకు అవసరమైన పనిముట్లు అందజేసినట్లు చెప్పారు. మత్స్యకారులు, చేనేత కార్మికులు, శెట్టిబలిజలకు 50 ఏళ్లకే పెన్షన్ ప్రవేశపెట్టడం టీడీపీ పాలనలోనే సాధ్యమైందన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు, మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో "మత్స్యకార భరోసా" కింద రూ.20,000 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. యాదవులకు గొర్రెలు, మేకల పెంపకం కోసం 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. బీసీలకు పార్టీ పరంగా మాత్రమే కాకుండా, వివిధ నామినేటెడ్ పదవుల్లో కూడా పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించిన పార్టీ టీడీపీ అని దేవర సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు గింజల లక్ష్మణరావు, కురందాసు నూకరాజు, గోసల తాతారావు, మెరుగు నాగేశ్వరరావు , గోసల శ్రీకాంత్, ఎరుపల్లి అప్పలరాజు, పిక్కి సత్తియ్య , గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, వాసుపల్లి సత్యం, శివాజీ మడత రాంబాబు, కొరిమి సూర్య గణేష్, తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యశ్రీ అందని అభాగ్యులకు భరోసా..
## ఎమ్మెల్యేకు ఆకుల ఫౌండేషన్ వినతి

బుచ్చయ్యపేట ఏప్రిల్ 24 ప్రభాతవార్త



నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న శాసన సభ్యుడు కె ఎస్ ఎన్ రాజు ను ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు. ఈ సంద ర్భంగా చోడవరం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన ఫౌండేషన్ సభ్యులు పలు ముఖ్య విషయాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బుచ్చియపేట మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కొంతమంది పేద ప్రజలు ఇటీవల తీవ్రమైన అనారోగ్యానికి గురై శస్త్రచికిత్సలు చేయించుకున్నప్పటికీ, వారికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించకపోవడంతో స్వంత ఖర్చులతోనే చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు.ఈ నేపథ్యంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఖూచీీరా రాజు నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ కట్టుబడి ఉంటానని, ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# పేద విద్యార్థులకు డాక్టర్ కె కె వి ఏ సేవలు అభినందనీయం

అనకాపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

విద్యాబివృద్ధికి డాక్టర్ కె కె వి ఏ నారాయణ రావు అందిస్తున్న సేవలు అబినందనీయమని ఏపి ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కొనియాడారు. స్థానిక కళ్యాణి నర్సింగ్ హోమ్‌లో పౌర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే పీలా మాట్లాడుతూ గడచిన దశాబ్దంన్నర కాలంగా పౌర్ణమి సంస్థ వేదికగా డాక్టర్ నారాయణ రావు ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల తో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ నిర్వహించడం అబినందనీయమన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వందలాది మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించి దేశ విదేశాలలో వివిధ అత్యున్నత హోదాలో స్థిరపడటం విశేషమన్నారు. అనకాపల్లి జిల్లాలో రానున్న కాలంలో పలు పరిశ్రమలు వస్తున్నాయని బాగా చదువుకున్నవారు స్థానికంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పలువురు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ నారాయణ రావు మాట్లాడుతూ పౌర్ణమి సంస్థ సేవాకార్యక్రమాలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న సామాజిక వేత్తల కృషిని కొనియాడారు. ట్రాఫిక్ సి ఐ వెంకట నారాయణ, ప్రముఖ బెల్లం వర్తకులు కర్రి సన్యాశినాయుడు. పౌర్ణమి సంస్థ ప్రధాన కార్యదర్శి ఆదికోటి, బుద్ద సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అతిథులను పౌర్ణమి సంస్థ తరుపున ఘనంగా సత్కరించారు.






# అభివృద్ధిలో జీవీఎంసీ అనకాపల్లి జోన్‌కి అన్యాయం

అనకాపల్లి ఏప్రిల్ 24 (ప్రభాత వార్త)



అనకాపల్లి రూరల్ జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న నేపథ్యంలో విశాఖ దీటుగా అన్ని విధాలుగా అభివృద్ధి చేయవలసి ఉండగా విశాఖ జీవీఎంసీ ప్రధాన కమిషనర్ అనకాపల్లి జోన్ అభివృద్ధి పట్ల అన్యాయం చేస్తున్నారని ఉమ్మడి విశాఖ జిల్లా టెలికాం అడ్వైజర్ కమిటీ మెంబర్ బుద్ధ రాజేష్ ఆరోపించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ అనకాపల్లి జీవీఎంసీ 94 వార్డుల నుంచి 120 వార్డులు పెరుగుదల అనకాపల్లి జోనుకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చేసిన పొరపాటే ఇప్పుడున్న అధికారులు కూడా మళ్లీ అనకాపల్లి జోన్ మీద చేస్తున్నారని ఆరోపించారు. 2021 జనాభా ప్రకారం వార్డులు విభజన చేయాలని, లేదంటే రాష్ట్ర ప్రభుత్వం జనగణమన కార్యక్రమం నిర్వహిస్తుంది . ఈ కార్యక్రమం అయ్యాక వార్డులు డివిజన్ చేయాలన్నారు. ఇప్పుడు అంత తొందరగా డివిజన్ చేయవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు . 2011 జనాభా ప్రకారం 1,05000 మంది అనకాపల్లి జోన్ లో ఉంటే 2025 వచ్చాక జనాభా పెరుగుతుందన్నారు. ఈ 15 సంవత్సరాల్లో అనకాపల్లి ఇల్లు నిర్మాణ రంగంలో ఎన్నో విప్లాత్మకంగా అపార్ట్మెంట్లు వచ్చాయి. అనకాపల్లి జిల్లా ఏర్పడింది. ఎక్కడినుంచో వలసలు వచ్చి ఇక్కడ స్థిరపడి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అనకాపల్లి జోన్ జనాభా పెరుగుదల ఉంటుంది. అభివృద్ధిలో మిగతా జోన్లు చూసుకుంటే అనకాపల్లి జోన్ కి తీవ్ర అన్యాయం జరిగింది. గ్రేటర్ కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జనగణమన కార్యక్రమం అయ్యాకే వార్డులు డివిజన్ చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ బుద్ధ రాజేష్ విజ్ఞప్తి చేశారు.

# అలియన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

అనకాపల్లి రూరల్ ఏప్రిల్ 24, ప్రభాతవార్త



అనకాపల్లి అలియన్స్ క్లబ్ నూతన కార్యవర్గం శుక్రవారం ఏర్పాటయింది. శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నందు గల గ్రంధి కన్నయ్య పంతులు ఏసి హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 2026-27 సంవత్సరం గాను ఎన్నిక జరిగి ప్రమాణ స్వీకారం జరిగింది. ఆలయాన్స్ క్లబ్ కార్యవర్గం ఒక సంవత్సరం కాల పరిమితి కి గాను కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ కెవి సత్యనారాయణ, సెక్రటరీ ఆళ్ల నాగేశ్వరరావు, కోశాధికారి పలుకూరి శంకర్ మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సౌత్ జోన్ విశాఖపట్నం 105 గవర్నర్ ఎస్ ఉమామహేశ్వరరావు హాజరై నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను మిగతా సభ్యులను అభినందించారు. ఈ సంవత్సరకాలంలో సభ్యులందరూ సహకారంతో మరెన్నో సమాజసేవ కార్యక్రమాలు చేయాలని కొత్త కార్యవర్గ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 100 మంది అలియన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# త్రాగునీటికై బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

నక్కపల్లి ,ప్రభాతవార్త



త్రాగడానికి మంచినీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే వేసవి కాలాన్నిదృష్టిలో ఉంచుకొని త్రాగునీటి కి ఇబ్బందులు లేకుండా మా గ్రామానికి చర్యలు చేపట్టాలని కోరుతూ చందనాడకు చెందిన మహిళలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గం ఇన్చార్జ్ వీసం రామకృష్ణ నాయకత్వంలో శుక్రవారం ఖాళీ బిందెలతో గ్రామీణ మంచినీటి సరఫరా కార్యాలయం వద్ద



ఆందోళన చేపట్టారు. మాజీ సర్పంచ్ తల్లా భార్గవ్, ఎంపిటిసి గంట తిరుపతిరావు ల నాయకత్వంలో మండలంలోని చందనాడ గ్రామానికి చెందిన మహిళలు ఊరికి దూరంగా ఉన్న జగనన్న కాలనీకి పైప్లైన్ ద్వారా మంచినీరు రావడంలేదని, చాలా రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నామని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఒకపక్క ఆవేదన వ్యక్తం చేస్తూ మరోపక్కఆరోపిస్తూ నిరసన తెలిపారు.



ఐదు సంవత్సరాల క్రితం నూతనంగా ఏర్పడిన కాలనీకి ఒక బోరు మాత్రం ఉందని, ఆ బోరు నుంచి వచ్చే నీరు సరిపోవడంలేదని, గొట్టువాడ నుంచి వచ్చే ప్రాజెక్టు మంచినీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీరు రాక చందనాడ గ్రామానికి కాలినడకన వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నామని మహిళలు అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. చందనాడ, తమ్మయ్యపేట, బట్టీలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారందరికీ ప్రాజెక్టు నుంచి నీరు వచ్చినట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు వీసం రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని మంచినీటి సమస్య తో ప్రజల ఇబ్బంది పడుతున్నారని ప్రధానంగా చందనాడ గ్రామమే కాకుండా ఉపమాక, నక్కపల్లి పట్టణంలో సాయి నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో సమస్య అధికంగా ఉందని, అధికారులు దృష్టి పెట్టకపోవడం దారుణమని ఎంపీడీవో కే. చలపతిరావుకు తెలిపారు. అనంతరం రామకృష్ణ ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. అనంతరం రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీవో తక్షణమే చర్యలు చేపడతామని మంచినీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, మండల పరిషత్ అదనపుఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి పొడగట్ల పాపారావు, విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఎలమంచిలి చందు, వెదుళ్ళ రమణ ,మాజీ ఉపసర్పంచ్ వీసం రాజు, అల్లాడ కొండబాబు తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభలు

ఎస్.రాయవరం ఏప్రిల్ 24. ప్రభాతవార్త




జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో శుక్రవారం ఎంపీడీవో మీనా కుమారి సర్వసిద్ధి, సైతారు పేట గ్రామాల్లో జరిగిన ప్రత్యేక గ్రామ సభల్లోపాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనా కుమారి మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ చట్టం (1992) ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించి దేశవ్యాప్తంగా స్థానిక పాలనకు నిర్దిష్ట రూపాన్ని కల్పించారు. మండల అభివృద్ధికి కృషి చేసినటువంటి రాజా మాజీ ఎంపీపీ కే వెంకటలక్ష్మి,ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, సైతారు పేట ఎంపీటీసీ రాములను ఎంపీడీవో మీనా కుమారి సన్మానించారు. డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ చిన గుమ్ములూరు.. దార్ల పూడి..తిమ్మాపురం గ్రామ పంచాయతీలలో జరిగిన ప్రత్యేక గ్రామ సభ సమావేశాలలో పాల్గొన్నారు. ఈ చట్టం 1993.. ఏప్రిల్ 24 నుండి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో..స్థానిక సంస్థల పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంపొందిం చడంలో భాగంగా అన్ని స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు మూడో వంతు స్థానాలు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. సుస్థిర అభి వృద్ధి సాధనకోసం ప్రతి ఒక్కరూ గ్రామ సభలో పాల్గొని తమ అభిప్రాయాన్ని చెప్పడంతో పాటు స్థానిక సమస్యలపై చర్చించాలన్నారు.చిన గుమ్ములూరు గ్రామ పంచాయతీలో గ్రామ పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న క్లాప్ మిత్రలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోలిశెట్టి గోవిందరావు, ఏవో రమేష్ బాబు ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్స్, స్థానిక ప్రజా ప్రతినిధులు.. గ్రామ పెద్దలు.. సచివాలయం సిబ్బంది. అంగన్వాడీ సిబ్బంది.పంచాయతీ కార్యదర్శులు ప్రసాదు, శ్రీనివాసు, సాయి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

vsp11:vsp11.qxd 24-04-2026 22:04 Page 1






## గంజాయి నిందితుడికి 10 ఏళ్లు కఠిన కారాగార శిక్ష... లక్ష జరిమాన



**పాడేరు ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా అల్లూరి సీతారామరాజు ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గంజాయి స్మగ్లర్లకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో రాజీ పడేది లేదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆర్. గౌరిఈశ్వరరావు స్పష్టం చేశారు. పాడేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2014లో 360 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో పట్టుబడి ననిందితుడికి శిక్ష పడ టంపై ఎక్సైజ్ ఆఫీసర్ గౌరిఈశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరా లను ఎక్సైజ్ ఆఫీసర్ తెలియజేసారు. పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2014 మే 30 వ తేదీన ఒక ఐచర్ గూడ్స్ వ్యాన్ తిశి 37 టి వి 3713. సుమారు 360 కిలోల గంజాయి, అక్రమ రవాణా చేస్తూ రాజమండ్రి ప్రాంతానికి చెందిన నాయుడు శ్రీనివాస్ (30) పట్టుబడ్డాడని దీంతో ఈ గంజాయి అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించి నిందితుడిపై అప్పటి ఇన్స్పెక్టర్ పిన్నిటి శ్రీనివాసరావు, ఎస్ఐ డి.గంగాధర్,ఏం జ్ఞానేశ్వరి చార్జ్‌షీట్ దాఖలు చేశారన్నారు. దీంతో ఈ అక్రమ గంజాయి కేసుపై కోర్టులో సాక్ష్యాధా రాలతో నిరూపించడంతో చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం. హరినారా యణ నిందితుడైన ఎ2 రాజమండ్రి ప్రాంతానికి చెందిన నాయుడు శ్రీనివాస్ (30) అనే వ్యక్తికి 10 సంవత్సరాలు ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు లక్ష జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ గౌరిఈశ్వర రావు తెలియజేసారు. ఈ సందర్బంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆర్. గౌరిఈశ్వరరావు మాట్లాడుతూ, పక్కా ఆధారాలతో పట్టుకుని చార్జ్ షీట్ దాఖలు చేసిన అప్పటి ఇన్స్పెక్టర్ పిన్నిటి శ్రీనివాసరావు, ఎస్ఐ గంగాధర్, ఏం.జ్ఞానేశ్వరి వారి సిబ్బందిని ప్రత్యేకంగా ఆయన అభినందించారు. అలాగే ఫోరెన్సిక్ రిపోర్టులు, సాక్ష్యాధారాలను కోర్టులో సమర్థవంతంగా ప్రవేశపెట్టిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.హెచ్.సూర్యనారాయణని, ప్రస్తుత పాడేరు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ టివివిఎస్ఎన్ ఆచారినీ, కోర్టు మోనిటరింగ్ సెల్ సిబ్బంది హెచ్సీ ఏం.ఏం నాయుడుని జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ అభినందించారు.

## అమ్మవారి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు

**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**



గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగుబం గారం పాడేరు మోదకొండమ్మ వారి ఆలయంలో ఆల య కమిటీ చైర్మన్ పాడేరు శాసనసభ్యులు మత్స్య రాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వ హించారు. భక్తులు అధికసంఖ్యలో వచ్చి అన్నప్రసా దాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి మాజీ జడ్పీ చైర్పర్సన్ వంజంగి కాంతమ్మ, బాకూరు పాండురాజు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు భోనంగి వెంకటరమణ, దన్నేటి పలాస రాము, చంద్రమోహన్ కుమార్, లకే రత్నబయి, గూడెపు సూర్యా ప్రకా ష్, పాలసీ రమణమ్మ, జంపరంగి సత్తిబాబు, మోద స్వరూప, దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సంకల్పం, చైతన్యం , అభ్యుదయం 2.0 పై మానవహారం



**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఇన్స్పెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ గోపినాథ్ జెట్టి,అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు సంకల్పం, చైతన్యం, అభ్యుదయం 2.0.. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాడేరు డిగ్రీ కాలేజీ విద్యార్థిని విద్యార్థులతో గంజాయికి వ్యతిరేకంగా మానవ హారం అంబేద్కర్ జంక్షన్ వద్ద సిఐ దీనబందు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ మాట్లా డుతూ గంజాయికి వ్యతిరేకంగా అందరం కలిసి కట్టుగా పోరాడాలని, గంజాయికి దూరంగా విద్యార్థులు ఉండి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐతో పాటు ఎస్ఐ పాపినాయుడు పాల్గొన్నారు.ఏదైనా గంజాయి సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కి గాని నేరుగా గాని పోలీసులకు తెలియజేయాలని సిఐ దీనబందు కోరారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సంద ర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు, తెలుగుదేశం సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు వంజంగి గ్రామ పంచాయతీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొర్రా నాగరాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్వాలంబన అధికారం గ్రామ ప్రజల చేతుల్లోనే ఉందని అది సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పంచాయతీ ప్రత్యేక అధికార, ఎంపీడీవో తేజరతన్‌ని, పంచాయతీ అభివృద్ధి అధికారి వి.చిన్నిని హరిత, తదితరులను ఘనంగా సత్కరించారు.

## మహిళల భద్రత మన బాధ్యత : సీఐ హిమగిరి



**డుంబ్రిగూడ, ఏప్రిల్ 24, (ప్రభాతవార్త):** మహిళల భద్రత మన బాధ్యతని అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్. హిమగిరి చెప్పారు. అరకు వారపు సంత మండల కేంద్రంలో శుక్రవారం మహిళల భద్రత మన బాధ్యత అనే నినాదంతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు మహిళల భద్రత మన బాధ్యత కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దురాచారాలను అరికట్టడంలో ప్రతిఒక్కరు మానవత్వ దృక్పథం కలిగి ఉండాలని సిఐ కోరారు. డుంబ్రిగూడ ఎస్సై సురేష్, అరకులోయ ఎస్సై మల్లేశ్వరరావు, వైసీపీ సీనియర్ నాయకులు కృష్ణారావు, రామదాసు మాజీ ఎంపిటిసిలు, పోలీస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## ఐటీడీఏ పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే



**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు జిల్లా వడ్డాది మాడుగుల నియోజకవర్గం తాటిపర్తి గ్రామ పంచాయతీ కాశీపురం గ్రామంలో ఉన్న పసుపు ప్రాసెసింగ్ యూనిట్ను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన రైతుల వద్ద నుండి ఎండిన పసుపు దళారులు కేజీ 130 రూపాయలకు కొనుగోలు చేసి,ఆ తరువాత ఎండిన పసుపుని శుద్ధి చేసి బయట మార్కెట్లో 170 రూపాయ లకు అమ్ముతున్నారని,మరల మార్కెట్లో అదే పసుపు మనం కిలో ..250 రూపాయలు కొనుగోలు చేస్తు న్నామన్నారు... ఇక్కడ కేవలం పాడేరు ఐటిడిఏ, జిసిసి సంస్థ అలసత్వం స్పష్టంగా కనపడుతుందన్నారు... దీనివలన గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత 15 ఏళ్లుగా ఇదే విధంగా పసుపు పండిస్తున్న గిరిజన రైతుల యొక్క రెండు సంవత్సరాల శ్రమను దళారులు చాలా ఏళ్లుగా దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. పసుపు పండిస్తున్న రైతులకు ఆసరాగా పాడేరు ఐటిడిఏ ఆధ్వర్యంలో పసుపు ప్రొసెసింగ్ మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్లను నెలకొల్పి, బాసటగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు... అందుకుగాను జిల్లా కలెక్టర్,సబ్ కలెక్టర్,పాడేరు ఐటిడిఏ పిఒ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు... లేదంటే గిరిజనులతో తీవ్రమైన వ్యతిరేకత ప్రభుత్వం ఐటిడిఏ, జిసిసి సంస్థ ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,ఐటీడీఏ పిఒ, జిసిసిఅధికారులు మేల్కొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించి,న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం



**గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను జీకేవీధిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ బోయినకుమారి, ఎంపీడీవో రమణబాబు, వైస్ ఎంపీపీలు ఆనందరావు, దేముడు ఆధ్వర్యంలో శుక్రవా రం ఈ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు నిర్వహించా రు. గ్రామాలు అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ మూల స్తంభంగా ఉందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రత్యేక చొరవ చూపుతోందని తెలిపారు. అందుకు పాటుపడుతున్న జీకే వీధి మండల పంచాయతీరాజ్ సిబ్బందికి అధికారులకు అభినందించారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శి కిట్లంగి బాలకృష్ణ, ఉపాధి హామీ పథకం ఏపీఓ చల్లంగి రాంప్రసాద్, కార్యాలయం సిబ్బంది కనకం, రేణుక లను ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు రీమల రాజేశ్వరి, రాజులమ్మ, మండల పరిషత్ పరిపాలన అధికారి ఇమ్మానుయేల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏబులంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం ప్రారంభించాలి



**గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** మండలంలో రింతాడ-2 పరిధిలోని ఏబులం గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం తక్షణమే ప్రారంభించాలని కోరుతూ జనసేన పార్టీ పంచాయతీ ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్ డిమాండ్ చేశారు.రింతాడలో శుక్రవారం పంచాయతీ అభివృద్ధి అధికారి అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం లో ఆర్‌బీకే, సచివాలయ భవనాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం అవి వినియోగంలో లేక మూసివేయ బడి ఉన్నాయని తెలిపారు. దీనివల్ల రైతులు విత్తనాలు, వ్యవసాయానికి సంబంధించిన అవసరమైన సామగ్రి, ఇతర సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్దేశించిన విధంగా ప్రజలకు అన్ని సేవలు అందుబాటులో ఉండేలా సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని విద్యుత్, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలతో సిద్ధం చేసి వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కొయ్యం ఇమ్మానుయేల్, నాయకుడు సాగిన బ్రాహ్మజీ పడల్, టీడీపీ మార్కెట్ డైరెక్టర్ మొట్టడం శరబన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

## అడ్డంగా పడిన చెట్టు తొలగింపు



**గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):** రింతాడ పంచాయతీ పరిధిలోని టేకుల వీధి-ముల్లుమెట్ట గ్రామాల మధ్య రహదారిపై భారీ వర్షాల కారణంగా చెట్టు కూలి వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారింది.ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో చింతపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మొట్టడం శరబన్న దొర స్వయంగా ముందుకు వచ్చి చెట్టును తొలగించారు. టిడిపి నాయకుడు సంజీవరావుతో కలిసి రహదారిపై పడిన చెట్టును తొలగించి మార్గాన్ని సాఫీ చేశారు.ఈ సందర్భంగా శరబన్న దొర మాట్లాడుతూ,మూడు వారాల క్రితం ఇదే ప్రాంతంలో ద్విచక్రవాహనం, బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటనను గుర్తుచేశారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు ఉండటం ప్రమాదాలకు దారితీసే అవకాశముండడంతో స్వచ్ఛందంగా చెట్టును తొలగించామని తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఇలాంటి అడ్డంకులను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను కోరారు.

## గ్రామ స్వరాజ్యం ద్వారానే నవభారత నిర్మాణం సాధ్యం : కలెక్టర్






**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** అల్లూరి జిల్లా పాడేరులో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మోదకొండమ్మ అమ్మవారి ఆడిటోరి యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ వేడుకలలో ముఖ్య అతిధిగా కలెక్టర్ టి.నిశాంతి పాల్గొని ప్రసంగించారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం ద్వారానే వికసిత్‌భారత్ 2047 సాధించవచ్చని, నిజమైన ప్రజాస్వామ్యం మన గ్రామాల్లోనే వెల్లివిరుస్తుం దని తెలిపారు. గ్రామప్రజల కనీస అవసరాలు తీర్చడంతోపాటు, మౌళిక వసతుల కల్పన, సుస్థిర అభివృద్ధి లక్ష్యా సాధనలో స్థానిక సంస్థలు కృషిని జిల్లా కలెక్టర్ అభినందించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామ స్థాయి నుండి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, గ్రామాలను స్వయం సమృద్ధిగా మార్చడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, పంచాయతీ రాజ్ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచే యాలని సూచించారు. పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డిఈశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ మాట్లాడుతూ 1993 రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధత కల్పించినట్లు, ఫలితంగా స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికల నిర్వహణ, యస్.సి/యస్.టిలకు తగిన ప్రాతినిద్యం, పదవులలో మహిళలకు రిజర్వేషన్ ద్వారా 50 సీట్లు కేటాయింపులో సాధ్యపడినట్లు ఆయన వివరించారు. అనంతరం పన్నుల వసూళ్ల మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రతిభ చూపిన ఉద్యోగులను దుస్సాల్వతో కలెక్టర్ సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి. సుబ్బారావు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, పి.ఏ.సి. యస్ అధ్యక్షులు వెంకటరమణ, మార్కెటింగ్ డైరెక్టర్స్ సుబ్బలక్ష్మి, కుమారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, యం.పి.డి.ఓ తేజారత్నం, డిప్యూటీ యం.పి.డి.ఓలు రమేష్, రామకృష్ణ గ్రామస్తులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్)కు 84 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో కలెక్టర్ టి.నిశాంతి జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, పాడేరు ఐటిడిఏ పివో ఆదిత్య వర్మ, ఇంచార్జ్ డిఆర్వో ఎమ్ వి ఎస్ లోకేశ్వరరావు, కెఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీదారులకు తెలిపారు. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారి ఆ శాఖ సమగ్ర సమాచారంతో హాజరుకావాలని అలా హాజరుకాలేని అధికారి ముందుగానే అనుమతి పొందాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో అధికారి మాత్రమే ఉండాలి, అర్జీదారుని నమోదు కౌంటర్ దగ్గర కింద స్థాయి శాఖ అధికారి ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయిలోనే పరిశీలించి నట్లయితే, జిల్లా స్థాయిలో ఎక్కువ మంది ప్రజా ఫిర్యాదులు చేసేందుకు రారని, అలాగే ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. గ్రీవెన్స్‌లో ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి. బాబు, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసా యాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి. మురళి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. కృష్ణ మూర్తి నాయక్ , స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, జిల్లా పర్యాటక శాఖ అధికారి దాసు,తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ



**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎమ్ఆర్ఎస్)కు చెందిన విద్యార్థి కిల్లో ప్రవీణ్, జేఈఈ (మెయిన్స్)2026 ఫలితాల్లో అద్భుతమైన విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగ కిల్లో ప్రవీణ్ కు జిల్లా కలెక్టర్ నిశాంతి పాఠశాల యాజమాన్యం ఆయనను అభినందించి మెమొంటోను అందజేశారు. ప్రవీణ్ అల్లూరి జిల్లా, డుంబ్రిగుడ మండలం, సింధుపుట్టు గ్రామానికి చెందిన శ్రీ కె. మోహన్ రావు కుమారుడు. ప్రవీణ్ ఈ పరీక్షలో 77.26 పర్సంటైజ్ సాధించడమే కాకుండా, ఎస్టీ కేటగిరీలో 6431వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 28 ఈఎమ్ఆర్ఎస్ సంస్థలలో కిల్లో ప్రవీణ్ అత్యధిక పర్సంటైజ్ సాధించి, తన పాఠశాలకు, జిల్లాకు గొప్ప కీర్తిని తెచ్చిపెట్టారు. ప్రవీణ్ కనబరిచిన పట్టుదల, కష్టపడేతత్వం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్,పాఠశాల ప్రతినిధులు కొనియాడా రు. విద్యార్థి అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ప్రవీణ్ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## జోన్1 కొనసాగింపునకు ఉద్యోగ జేఏసీ పోరుబాట



**పాడేరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** అల్లూరి జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల వివిధ సంఘాలతో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం పాడేరు ఏపీ ఎన్జీజీవో భవన్, అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్, ఎల్. రవీంద్రబాబు పాత్రుడు మాట్లాడు తూ అల్లూరి జిల్లా జోన్ 1 లోనే కొనసాగింపు కొరకు సుదీర్ఘమైన చర్చలు జరిపాటు.ఈ చర్చల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ ఆదేశాల ప్రకారం, జి.ఓ నం. 45, ఈ నెల 20 వ తేదీ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టేట్ క్యాడర్స్‌ను మల్టీ జోనల్ క్యాడర్ గా మార్పు చేసి, కొత్త జోనల్స్ అమలు చేయడం జరిగిందని, దాని ప్రకారం అల్లూరి జిల్లా జోన్ 2 లో చేర్చబడిందని ప్రకటించారు. ఈ మార్పు వల్ల జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు మరియు విద్యార్థులు అనేక సమస్యలు, నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమగ్రంగా చర్చించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారనీ, గ్రామ, మండల మరియు జిల్లా స్థాయిలో ఐక్య పోరాటం చేయాలని నిర్ణయించారు. పాడేరు డివిజన్ కు చెందిన 11 మండలాలు విశాఖపట్నం జిల్లా భాగంగా ఉంటూ, ఈ ప్రాంతంలో గిరిజన విద్యార్థులు విశాఖపట్నం నుండి ఉన్నత విద్యాభ్యసి స్తుంటారు, దీని వలన విద్యార్థులు నాన్ లోకల్ గా వెళ్ళి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతారన్నారు. జోన్ 2 సుమారు గా 300 కిలోమీటరులు దూరం కావడం తో ప్రజలు ఇబ్బంది పడతారన్నారు. ఈ ప్రాంతం జోన్ 1లో తిరిగి చేర్చడం సముచితం అని పేర్కొన్నారు. అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ వారిని కలిసి జోన్ 2 లో చేర్చడం వలన అల్లూరి జిల్లా ప్రజలకు జరుగు నష్టాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. సమావేశంలో లకే. రవీంద్రబాబు పాత్రుడు (జేఏసీ చైర్మన్), యు. వెంకట గిరి (కార్యదర్శి), గిరిజన ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మసాద ఈశ్వరరావు, ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు రొబ్బ నాగభూషణ్, కుడుముల కాంతారావు, రావుల జగన్ మోహన్, వల్ల సలీం, కే వెంకట రమణ, గుల్లేలి సింహాద్రి, కుందూరు సురేష్, ఎస్ నాగరాజు, ఎస్ సంజీవరాజు, రఘునాథ్, మహేశ్వరరావు, సుబ్రహ్మణ్యం జేఏసీ అరకు, పాడేరు, చింతపల్లి యూనిట్ల అధ్యక్షులు కే సుబ్రమణ్యం, భద్రయ్య కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదంలో
# ఆరుగురికి గాయాలు ... ముగ్గురి పరిస్థితి విషమం



**అరకు రూరల్, ఏప్రిల్ 24, ప్రభాత వార్త :** అరకులోయ మండలం లో శుక్రవారం జరిగిన రెండు వేరు వేరు ప్రమాదంలో ఆరుగురు గాయపడగా , వారిలో మండలంలోని భీముడివలస దగ్గర జరిగిన ద్విచక్ర వాహనాల ఢీకొన్న సంఘటనలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో అరకులోయ ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి తదుపరి పాడేరు ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు .వివరాల్లోకి వెళితే ..... అరకులోయ మండలంలోని భీముడు వలస గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు డీ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో నలుగురు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. భీముడు వలస గ్రామములో జరిగిన ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు డికోవడంతో ఈ సంఘటన జరిగింది. దీంతో హుటాహుటిన అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు ఆసుపత్రికి తరలించారు. హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ దిగువ సల్లంగి గ్రామానికి చెందిన రాఫ కోటేశ్వరరావు( 22), చిట్టం నాయక్ చరణ్ ( 18) అరకులోయ మండలం బస్కి పంచాయితీ కుంతి రంగిని గ్రామానికి చెందిన పూజారి ధనరాజ్ (22) పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు ఆసుపత్రికి తరలించారు. అరకులోయ మండలం మాడగడ పంచాయతీ గత్తన గుడా గ్రామానికి చెందిన కిల్లో సాయి (24) కి పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ నిహారిక విలేకరులకు తెలిపారు. ఈ సంఘటనపై. అరకులోయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బస్కి పంచాయితీ దొరగుడా గ్రామములో కూడా ఓ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సంఘటనలో కూడా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన



**అరకురూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం పుస్తక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. కళాశాల గ్రంథాలయ అభివృద్ధి మరియు విద్యార్థుల్లో చదవడం పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల లైబ్రేరియన్ మాదల మోహన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పుస్తక ప్రదర్శనకు ప్రిన్సిపాల్ పట్టాసి చలాపతిరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వివిధ రంగాలకు సంబంధించిన పుస్తకాలు తెలుగు అకాడమీ పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే గ్రంథాలు ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు ఆసక్తిగా పుస్తకాలను పరిశీలించి, తమకు అవసరమైన గ్రంథాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చలాపతిరావు మాట్లాడుతూ, గ్రంథాలయం విద్యార్థుల జ్ఞానవృద్ధికి మూలాధారం అని అన్నారు. గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించి, అందులో ఉన్న పుస్తకాలను క్రమంగా చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని, విద్యార్థులు రోజువారీగా చదవడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. లైబ్రేరియన్ మాదల మోహన్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో చదవడం పట్ల ఆసక్తి మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు.

## సొంత నిధులతో మోచగూడకు వంతెన నిర్మాణం



**అరకు రూరల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచిన అరకులోయ మండలంలోని మెచగుడా గ్రామ గిరిజనులు సొంత నిధుల తో, శ్రమదానంతో గ్రామానికి అవసరమైన వంతెనను నిర్మించుకుంటున్నారు. అరకులోయ మండలం మాడగడ పంచాయతీలో గల మెచగూడ గ్రామస్తులు వంతెన నిర్మాణం కొరకు గతంలో పలు దఫాలుగా అధికారులు, నాయకులు చుట్టూ తిరిగారు. సమస్య పరిష్కారం కోరుతూ దరఖాస్తుల రూపంలో విన్నవించుకున్నారు. అయితే ఫలితం లేకపోవడంతో మెచగూడ గ్రామస్తులు సొంత నిధులతో, శ్రమదానాన్ని నిర్వహించి వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అధికారులు, పాల కులు వస్తారన్న నమ్మకం లేకపోవడంతో గ్రామస్తులంతా ఐకమత్యంగా సమస్యను పరిష్కరించుకుంటు న్నారు. ఈ సందర్భంగా మెచగూడ గ్రామస్తుల మాట్లాడుతూ తమ గ్రామ సమస్య ఏ నాయకుడికి గానీ, అధికారికిగానీ పట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులకు ఓట్లు కావాలే తప్పా, తమ సమస్యలు పట్టవని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో ఓటు అడగడానికి వచ్చే రాజకీయ పార్టీల నాయకు లకు తాము నిర్మించుకున్న వంతెనే సమాధానం చెబుతుందని మె చగూడ గ్రామస్తులు చెబుతున్నారు.

## కిట్లంగి బాలకృష్ణకు ఘన సత్కారం



**గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 24, (ప్రభాతవార్త):** విధి నిర్వహణ లో అంకితభావం కనబరుస్తున్న పెదవలస పంచాయతీ కార్యదర్శి కిట్లంగి బాలకృష్ణ విశేష సేవలు అందిస్తున్నారని ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీడీవో రమణబాబు తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జీకేవీధి లో శుక్రవారం బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీవో మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా జీకే వీధి మండలంలో పంచాయతీ కార్యదర్శిగా వివిధ పంచాయతీలో బాలకృష్ణ పని చేశారని తెలిపారు. ఆయన ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు గిరిజన గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో అర్హులకు చేర్చడంలో కీలకంగా పనిచేస్తున్నారన్నారు. అంకితభావంతో పనిచేస్తున్న ఆయన సేవలు కొనసాగించాలని కోరారు. తన విధి నిర్వహణను గుర్తించే సత్కరించిన అధికారులు ప్రజాప్రతినిధులకు బాలకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు. వైస్ ఎంపీపీలో ఆనందరావు, దేముడు, ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, రాజులమ్మ, పరిపాలన అధికారి ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

## ఒక్క ఫిర్యాదు.. 342 సిలిండర్లు..!

**గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):**

రెండు నెలలుగా వంట గ్యాస్ సరఫరా జరగడం లేదని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజా ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. ఆ ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టి 342 గ్యాస్ సిలిండర్లు వచ్చేలాగా చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా జీకేవీధి మండలంలో వంటగ్యాస్ వినియోగదారులకు గూడెం కాలనీలోని ఓ ప్రైవేట్ సంస్థ హెచ్.పీ గ్యాస్ ద్వారా సిలిండర్లు సరఫరా చేస్తోంది. అయితే ఇటీవల గ్యాస్ కొరత రావడంతో సరపరాకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సుమారు రెండు నెలలుగా వంట గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో జీకేవీధి ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి ఈనెల 17న మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మండల రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కు నివేదిక అందజేశారు. ఉన్నతాధికారులు వంటగ్యాస్ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సిలిండర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారని దీంతో గ్యాస్ కార్యాలయానికి శుక్రవారం 342 గ్యాస్ సిలిండర్లు వచ్చినట్లు తాసిల్దార్ అన్నాజీరావు లేఖ అందించినట్లు ఎంపిటిసి రాజేశ్వరి తెలిపారు. వినియోగదారులు ఆన్లైన్లో గ్యాస్ నమోదు చేసుకొని సిలిండర్లను విడిపించుకోవాలని సూచించారు. వచ్చిన సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

25skl13:25skl13.qxd 24-04-2026 22:54 Page 1



## ఉత్తమ అధికారులకు అవార్డులు



కంచిలి, ఏప్రిల్24, ప్రభాతవార్త : ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు అవార్డులు అందుకున్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్ చేతుల మీదుగా కంచిలి డిప్యూటీ ఎండిఓ జి.వీరభద్రస్వామి, తలతంపర పంచాయతీ అభివృద్ధి అధికారిణి వి.విజయలక్ష్మి అవార్డులు అందుకున్నారు. వీరికి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## పేదలకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం : నిమ్మక



సీతంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : పేదలకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన సీతంపేటలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు కడుపునిండా మూడు పూటలా ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ఆనాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అన్న క్యాంటీన్లు ప్రారంభించారని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రాన్ని సందర్శించి డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్, టిడిపి ఇంచార్జ్ పడాల భూదేవి, ఏఎంసీ చైర్మన్ సంధ్యారాణి, ఇమరక పవన్, టిడిపి మండల అధ్యక్షులు సవర తోట ముఖలింగం, కర్నాన అప్పలనాయుడు, జనసేన మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అశోక్



కవిటి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : దేవాలయాల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం మండలం శ్రీ చక్ర పెరిమాత స్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మిస్తున్న మండపానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గల ఆలయాల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తానని ఘంటాపదంగా తెలిపారు.ఆలయ ధర్మకర్తలు పి.కృష్ణారావు, రాంబాబు నాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, బార్ల జగన్నాథం, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలి : కలెక్టర్



వీరఘట్టం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలు పారదర్శకంగా ఉండాలని తహాశీల్దార్ సిబ్బం దికి జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. శుక్రవారం పాలకొండ తహాశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. మండల కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలు, విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని హాజరు పట్టికతో పాటు భూమి రికార్డులు, రీసర్వే పురోగతి మరియు పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ సేవల పనితీరును మెరుగుపరచాలని, డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. తనిఖీలో తహసీల్దార్‌తో పాటు కార్యాలయ రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ తిరువీధి, కుంకుమ పూజ



కోటబొమ్మాళి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : మండలం చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం భాగంగా శుక్రవారం అంజనేయస్వామికి తీరువీధి, కుంకుమపూజలు వేదపండితులు సుసరాపు చంద్రశేఖరశర్మ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మెండ అప్పన్న, నేతింటి సింహాచలం దంపతులచే వేద పండితులు చంద్రశేఖర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖ ప్రవచనకారులు సనపల కరుణ్‌కుమార్ భక్తులను ఉద్దేశించి పలు సందేశాలు వివరించారు. తీరువీధిలో సుమారు 150 మంది చేసిన కోలాటం భక్తులకు అకట్టుకుంది. అలాగే ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మహాఅన్నదాన కార్యక్రమం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆలయ ధర్మకర్తలు అప్పన్న, సింహాచలం కోరారు.

## ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం : కూన



ఆమదాలవలస, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: ప్రజాదర్బార్‌తో ప్రజా సమస్యలను పరిష్కరించుకోవచ్చునని, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం శాంతినగర్ కాలనీ ఎమ్మెల్యే రవికుమార్ నివాసములో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని అన్నారు. ప్రజా పాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. వచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. మరి కొన్ని సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే ఎన్ఈఆర్



రణస్థలం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలుగా ఉన్న పంచాయతీలు అభివృద్ధి పథంలో నడిచినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్పష్టం చేశారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన, రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు నడుకుదిటి రజని ఎన్ఇఆర్‌తో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే నిజమైన పురోగతి సాధ్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని కొనియాడారు. విప్లవాత్మక సంస్కరణలు, నూతన పథకాల ద్వారా గ్రామాల్లో సమగ్ర మార్పునకు శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు రజని ఎన్ఇఆర్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ ద్వారా లభించిన స్వయం పరిపాలన హక్కులు ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు దిశానిర్దేశం చేశాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు పిన్నింటి భానోజీనాయుడు, మాజీ సర్పంచ్‌లు పిసిని జగన్నాథం నాయుడు, రౌతు శ్రీనివాసరావు, బాలి శ్రీనివాసరావు, సన్యాసప్పల నాయుడు, కొత్తకోట్ల సత్యం అప్పడు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు



రాజాం, ఏప్రిల్ 24 ప్రభాత వార్త : వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు దాహం తీర్చే విధంగా మున్సిపల్ కార్యాలయం ముందు పురపాలక సంఘం తరుపున చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్, మున్సిపల్ కమీషనర్ ఆకురాతి రామచంద్రరావు, అసిస్టెంట్ ఇంజినీర్ పి.వెంకట రామరాజ్, మున్సిపల్ సిబ్బంది, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సంధిపేటలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం



సంతబొమ్మాళి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : సంతబొమ్మాళి మండలం సంధిపేట గ్రామంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జర్జాన ప్రవీణ్ కుమార్ 62 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా వెన్ను మోకాళ్ళ నొప్పులు, డయాబెటిస్, శ్వాస సమస్యలు, చర్మ రోగాలు, ఇతర దీర్ఘకాలిక సమస్యలకు మందులు పంపిణీ చేసి యోగ విశిష్టత జీవన శైలి మార్పుల వల్ల కలిగే ఉపయోగాలు తెలుపుతూ ఆసుపత్రిలోని ఆయుర్వేద వైద్య సేవలు ఉచిత యోగ శిక్షణ వంటి సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైద్యులతో పాటు యోగ గురువులు చంద్రశేఖర్, ఉషారాణి, ఆసుపత్రి సిబ్బంది పద్మావతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



కవిటి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కవిటి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఉత్సవాలను దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీవో హెల్త్ త్రినాథ్, ఏవో శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్, మండల కోసం పాండవ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కర్రి గోపయ్యలతోపాటు ఎంపీటీసీ పూడి నీలాచలం అలానే పలువురు ఎంపీటీసీలకు ఘనంగా సన్మానించే కార్యక్రమం చేపట్టారు.

## మాజీ సర్పంచ్‌లకు ఘన సన్మానం



కోటబొమ్మాళి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్‌లు ఐదుగురుకి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా సన్మానించారు. వీరిలో కల్లి లక్ష్మణరెడ్డి, బోయిన గోవింద రాజులు, ఆయన సతీమణి బోయిన శారదాంబ, లొట్టి రామారావు, దేవాది సింహాద్రమ్మలు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కలింగ కోమటి కార్పోరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌లకు ఇలా సన్మానించటం ఎంతో సంతోషకర విషయమన్నారు. దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలని, పంచాయతీ రాజ్ వ్యవస్థ ఇంకా బలోపేతం అయితే సత్ఫలితాలు పొందవచ్చునని ఆయన అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లు సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ వైస్ ఎంపీపీ కల్లి నాగయ్యరెడ్డి, వార్డు మెంబర్లు మంచాల వెంకటరావు, నౌగాపు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి చింతాడ సన్యాసి, గ్రామ పెద్దలు కోరాడ పెద్ద గోవింద, చిన్న గోవింద, తదితరులు ఉన్నారు.

## ఉపరాష్ట్రపతి ప్రతిపాదిత పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



శ్రీకాకుళం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ సోమవారం జిల్లాకు విచ్చేయనున్న పర్యటనకు యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. పర్యటనలో భాగంగా ఆయన ప్రయాణించే హెలికాప్టర్ల ల్యాండింగ్ కోసం డచ్‌బంగ్లా, పోలీసు క్వార్టర్స్ మైదానాల్లో ఉన్న హెలిప్యాడ్‌లను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి శుక్రవారం క్షుణ్ణంగా పరిశీలించారు. వీవీఐపీ భద్రతా నిబంధనల ప్రకారం ప్రధాన హెలిప్యాడ్‌కు అనుబంధంగా మరొకటి ఉండాలన్న నిబంధన మేరకు, డచ్‌బంగ్లా వద్ద ప్రస్తుతం ఉన్న దాని పక్కనే మరో కొత్త హెలిప్యాడ్‌ను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలీసు క్వార్టర్స్‌లోనూ అదనపు హెలిప్యాడ్ నిర్మాణానికి స్థలాన్ని ఖరారు చేస్తూ, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఎక్కడా ఎటువంటి ప్రోటోకాల్ లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాల వద్ద భద్రత, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భద్రతా వలయం పకడ్బందీగా ఉండాలని, కాన్వాయ్ మార్గంలో ఎటువంటి ఆటంకాలు ఉండకూడదని అధికారులను అప్రమత్తం చేశారు. ఆర్ అండ్ బీ, రెవెన్యూ, పోలీస్, ఇతర ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



ఆమదాలవలస, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త): సమాజంలో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీ యమని కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్ (వెంకటేష్) అన్నారు. సరుబుజ్జిలి మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన ఎర్ల రమ్య పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సేవా గుణం కలవారు ప్రజలకు అన్ని విధాలుగా ఆదుకోవాలని పిలుపు నిచ్చారు. సమాజ సేవ చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యర్ల శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా అతని భార్య రమ్య సుమారు 50 మంది అనాధలకు, వృద్ధులకు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగిబేరి ఆనంద్, బొడ్డేపల్లి చంద్రశేఖర్, బైరి రాము, రోనంకి దినేష్, సంతోష్,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా




పలాస, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. పలాస ఆర్‌డిఓ కార్యాలయం వద్ద గురువారం తమ సమస్యలు పరిష్కారించాలంటూ అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయం ఎఓ ప్రకాష్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్స్‌గా మార్చాలని, ఆయాలకు ప్రమోషన్ గైడ్ లైన్స్‌లో మార్పులు చేయాలని కోరారు. పింఛన్‌తో కూడిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, చనిపోయిన అంగన్వాడీల మట్టి ఖర్చులు అమలు సరళతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బి.సునీత, బి.ఈశ్వరమ్మ, బి.శ్రీదేవి, గీతాదేవి, పార్వతి, లక్ష్మి, కళ్యాణి, శ్రీదేవి, యాదవతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## బోండిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



సీతంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : బోండిలో క్రికెట్ టోర్నమెంట్‌ను సీతంపేట ఎస్సై వై.ఆమన్నరావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో యువత క్రీడల పట్ల మంచి ప్రతిభా కనబరుస్తున్నారని అన్నారు. క్రికెట్ ఇరు జట్లు ఆడేటప్పుడు ఓడిపోయిన జట్టు స్పోర్టివ్‌గా తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి : డీఎస్పీ భవాని



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కాశీబుగ్గ డిఎస్పి టి.భవాని ఆదేశించారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఇచ్ఛాపురంలో పర్యటించారు. వికేపేట రోడ్డు, దాసన్నపేట ఇతర ట్రాఫిక్ పాయింట్‌లను తనిఖీ చేశారు. ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని చెప్పారు. రోడ్డుపై ఆక్రమణలు లేకుండా చూడాలని ఆదేశించారు. కొలిగాం రోడ్డులో ఇప్పటికే భారీ వాహనాలు రాకపోకలపై ఆంక్షలు ఉన్నాయని టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు డిఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.

## జిల్లా ఉత్తమ డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసరావు



సంతబొమ్మాళి, ఏప్రిల్ 24, ప్రభాత వార్త: శ్రీకాకుళం జిల్లా ఉత్తమ డెప్యూటీ ఎంపీడీఓగా దుంపల శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆర్.వెంకటరావు చేతులమీదుగా శుక్రవారం ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. మండలంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచడం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు విషయంలో కీలక పాత్ర పోషించడం వల్ల సీఈఓ పేర్కొన్నారు. అలాగే తాళ్లవలస గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.విజయకుమార్ వర్మ ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డు అందుకున్నారు.

# శ్రీకాకుళం వార్త



## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



రణస్థలం, ఏప్రిల్ 34 ప్రభాతవార్త : గ్రామ స్వరాజ్యమే దేశాభివృద్ధికి మూలమని, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలకు లభించిన స్వయం పాలనాధికారం ప్రజల సాధికారతకు నాంది అని మండల అధికారులు పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జె.ఆర్.పురం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మేస్త్రి పాణికుమార్‌కు ఘన సత్కారం మండల స్పెషల్ ఆఫీసర్ మరియు ఎంపీడీవో ఈశ్వరరావు, మండల ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోనే పారిశుద్ధ్య నిర్వహణలో జె.ఆర్.పురం పంచాయతీని ప్రథమ స్థానంలో నిలిపినందుకు గాను, శానిటేషన్ మేస్త్రి వద్దాది పాణికుమార్‌ను అధికారులు ఘనంగా సత్కరించారు. సాయికుమార్ చేతుల మీదుగా పాణికుమార్‌కు శాలువా కప్పి, దేవుని చిత్రపటాన్ని బహుకరించారు. ఈ వేడుకలో ఎల్.అప్పన్న ఇంజనీరింగ్ ఏఈఈ, ఎ.మార్కండేయ రావు, మండల వ్యవసాయ అధికారి, పంచాయతీల కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు మరియు సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా జ్ఞానేశ్వరి



పాతపట్నం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను పురస్కరిం చుకుని మండలంలోని తిడ్డిమి పంచాయతీ కార్యదర్శి ఆర్ జ్ఞానేశ్వరి ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డును అందుకున్నారు. పంచాయతీ అభివృద్ధిలో ఆమె కనబరిచిన ప్రతిభకు, అంకితభావానికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ మరియు డి.ఎల్.డి.ఓ చేతుల మీదుగా జ్ఞానేశ్వరి ఈ అవార్డును అందుకున్నారు. జ్ఞానేశ్వరి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో సహకరించిన ఉన్నతాధికారులకు, గ్రామ ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమెకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా గఘధసుని అమ్మవారి ఆలయ ప్రతిష్ట



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : కొలిగాం గ్రామ దేవత మా గఘధ సుని అమ్మవారి ఆలయ ప్రతిష్ట వైభవంగా జరుగుతుంది. పూజల్లో ఎమ్మెల్సీ నర్తు రామా రావు చామంతి దంపతులు, ఎంపిపి బోర పుష్ప, లోపింటి దీనభందు రెడ్డి, సంతోస్ మండలో, లోపింటి దుర్యోధన పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పాతపట్నం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, నాణ్యత లేని రహదారి మరమ్మత్తులతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బి.నారాయణమూర్తి విమర్శించారు. ఇటీవల పాతపట్నం, తెంబూరు రహదారి మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల విస్తరణతో పాటు, గ్రామీణ రోడ్లను నాణ్యతతో నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే గోవిందరావు, నేడు నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని పనులతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. పాతపట్నం నుండి టెక్కలి వరకు ఉన్న రహదారి జాతీయ రహదారి తర్వాత అత్యంత కీలకమైనదని, దీనిపై వందలాది గ్రామాల ప్రజలు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఆధారపడి ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మరమ్మత్తులు అత్యంత దారుణంగా ఉన్నాయని, ఇవి పాతపట్నం, మెళియాపుట్టి రహదారిలాగే మరమత్తులు చేపట్టిన కొద్ది రోజుల్లోనే పాడైపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితం నాటి అవసరాలకు అనుగుణంగా నిర్మించిన ఈ రహదారులు ప్రస్తుత రద్దీకి సరిపోవడం లేదని, వీటిని విస్తరించాల్సింది పోయి, కేవలం కంకరతో కప్పడం, అరకొర మరమ్మత్తులు చేయడం దేనికి సంకేతం? అని నారాయణమూర్తి ప్రశ్నించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు, అధికార పార్టీ నేతలకు పట్టింపు లేదని విమర్శించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనేక రహదారుల నిర్మాణాలకు హడావుడిగా శిలాఫలకాలు వేసి, శంకుస్థాపనలు చేసినా ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు క్షేత్రస్థాయిలో నిలదీయకముందే పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రహదారుల నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, నాణ్యతా లోపాలపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని నారాయణమూర్తి ఈ సందర్భంగా హెచ్చరించారు.

## టీడీపీలో పలువురి చేరిక



కంచిలి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బి.అశోక్ బాబు, జనసేన పార్టీ దాసరి రాజు సమక్షంలో పలువురు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవానికి విచ్చేసిన బెందాళం అశోక్ బాబు సమక్షంలో పలువురు దేశం పార్టీ కండువా కప్పుకున్నారు. బూరగాం గ్రామానికి చెందిన వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు నాయకులు బద్రి కామేష్, మద్దునేతాజీ, మద్దు లోకనాథం, బొట్ట సంతోష్‌లకు తెలుగుదేశం పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు కలిసి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని గుర్తించి పార్టీలో చేరామని అన్నారు.

## జిల్లా ఉత్తమ ఎంపీడీవోగా ఫణీంద్ర కుమార్



కోటబొమ్మాళి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ సేవలు అందించినందుకు గాను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శ్రీకాకు ళం శాసన సభ్యులు గొండు శంకర్ చేతులు మీదు గా జిల్లా ఉత్తమ ఎంపీడీవోగా కె.ఫణీంద్రకుమార్‌కు ప్రశంసాపత్రం, మొమెంటుతో శుక్రవారం సత్కరిం చారు. అలాగే జిల్లా ఉత్తమ పంచాయతీ అభివృద్ధి అధికారిగా మండలం తర్లిపేట గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి వి.రమేష్‌కు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్. వెంకటరమణ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మొమెంటుతో సత్కరించారు. వీరిని మండల పరిషత్ ఏవో నారాయణ, పంచాయతీ కార్యదర్శులు బోకర నరేష్, డి.బాలక్రిష్ణ తదితరులు అభినందించారు.

## అభివృద్ధే...మూడుసార్లు విజయానికి కారణం

కంచిలి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : ఇచ్ఛాపురం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు అన్నారు. శుక్రవారం కంచిలి మండలం బూరగాం పంచాయతీలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ దాసరి రాజుతో కలిసి 1.19 కోట్ల అభివృద్ధి పనుల 66.84 లక్షల 1.9 కిలోమీటర్ల బూరగాం సోంపేట బిటి రోడ్డు, 30 లక్షలతో ఎన్ హెచ్ 16 నుండి రైల్వే గేట్, 12 లక్షలతో శివాలయం సీసీ రోడ్డు, ఎంపీ లాడ్, పంచాయతీ కలిపి ఏడు లక్షలు కళా వేదిక, రెండు లక్షల రూపాయలతో కప్ప వీధి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్, దాసరి రాజు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్లపై ప్రయాణించేవారు తూలుతూ పడుతూ డబ్బులు తగిలించుకుంటూ ప్రయాణాలు చేసే వారిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తారు రోడ్లే కాకుండా వీధి వీధికి సిమెంట్ రోడ్లు వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లు వేశారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో 151 మంది గెలిపిస్తే రాష్ట్రానికి ఏమి చేశారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తారురోడ్లు, రక్షిత త్రాగునీరు, పారిశుద్ధం, విద్య, వైద్యం ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసి చూపించమన్నారు. గత ప్రభుత్వంలో 151 మంది గెలిచినప్పటికీ ఒక ఎంపీ గుడ్డలు విప్పి తిరిగితే మరొకరు గంట అరగంట, రప్ప రప్ప రప్ప అంటూ ప్రజలకు భయభ్రాంతులకు గురి చేయడంతో వీరి చేష్టలకు విసిగి ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం అందించారని అన్నారు. బెంతోరియాల విషయమై ఎస్టీ కుల సంఘం సోదరులు కలిసి బెంతోరియాలను ఎస్టీలుగా చేర్చోద్దని చెప్పేందుకు వచ్చారు. అయితే వారిలో ఒకరు తనకు అసెంబ్లీలో బెంతోరియాలు కోసం మాట్లాడడానికి నీవు ఎవరు అని ఏకవచనంతో మాట్లాడటం వలన పొరపాటున ఒక మాట దొరలడం జరిగిందని దీన్ని వైకాపా నాయకులు కుట్రలతో సోషల్ మీడియాలో రాద్ధాంతం చేయడానికి సిద్ధపడ్డారని అన్నారు. వైయస్సార్ పార్టీ గతంలో అధికారం కోసం 2000 పెన్షన్ 3000 ఇస్తామని చెప్పి వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదు సంవత్సరాల పట్టిందని, వెయ్యి రూపాయలు కూడా దఫా దఫాలుగా అందించిన

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన సత్కారం



గరివిడి, ఏప్రిల్ 24, ప్రభాత వార్త : ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు నిర్వహించి శుక్రవారం రిటైర్ అయిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కు గరివిడికి చెందిన హైకోర్టు న్యాయవాది, భారత ఆహార సంస్థ న్యాయ సలహాదారు డాక్టర్ మజ్జి సూరిబాబు దుస్సాలువతో సత్కరించి ఆయన సేవలను కీర్తించారు. పుష్పగుచ్ఛం తోపాటు సన్మానపత్రాన్ని అందించి ఆయన సేవలను కొనియాడారు. హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా ధీరజ్ సింగ్ ఠాకూర్ చేసిన సేవలను ఈ సందర్భంగా సూరిబాబుతో పాటు న్యాయవాదులు శ్లాఘనీయమన్నారు. న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ సత్కార కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు హరిత,రచన,రామకృష్ణ, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ తిల్హరి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సూరిబాబు సత్కరించటం పట్ల పలువురు సూరిబాబు ని అభినందించారు.

## బస్సు షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



పాచిపెంట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త : కర్రివలస జంక్షన్ వద్ద సాలూరు, పాచిపెంటకు అనేక అవసరాల మేరకు వెళ్లడానికి ప్రయాణికులు కర్రివలస జంక్షన్ వద్ద ఎండకి ఇబ్బంది పడుతూ వానకు తడుస్తూ ప్రయాణికులు వాహనాల కోసము నిరీక్షిస్తుంటారు. పాచిపెంట మండలం కర్రివలస పంచాయతీలో కర్రివలస గ్రామంలో సచివాలయంతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉండడంతో ఉపాధ్యాయులు సచివాలయం సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం విద్యార్థులు కళాశాలకు ప్రజలు అనేక అవసరాల నిమిత్తం ఆ జంక్షన్ వద్ద ప్రయాణికులు బస్సు షెల్టర్ లేకపోవడం వర్షాకాలంలో ఎండాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని పలువురు తెలిపారు. వృద్ధులు చంటి పిల్లల తల్లులు వేసవి కాలంలో ఉష్ణోగ్రతల పెరగడం వల్ల పాచిపెంట సాలూరు వెళ్ళినందుకుబస్సులు ఆటోలు కొరకు గంటలు తరబడి కర్రి వల్ల జంక్షన్ వద్ద నిరీక్షించవలసి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే కర్రివలస జంక్షన్ వద్ద బస్సు షెల్టర్ నిర్మాణం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 24 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



గరివిడి, ఏప్రిల్ 24,ప్రభాతవార్త : స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 24 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించారు. భోగాపురం అవంతీస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అకాడమీ లో జరిగిన మెగా జాబ్ ఫెయిర్‌లో గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అవంతీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ మాజీ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాసరావు నియామక పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్తెంశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ చాటుకొని ఉద్యోగాలు పొందడం ముదావహం అన్నారు. అధ్యాపకుల మెరుగైన విద్యాబోధన విద్యార్థుల ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకట రమణ, కళాశాల పరిపాలనాధికారి గరికపాటి అనీల్ కుమార్, ప్లేస్ మెంట్ అధికారి కె.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## నాదెండ్ల మనోహర్‌ను పరామర్శించిన జనసేన నేతలు



సాలూరు, ఏప్రిల్ 24, ప్రభాత వార్త: సీనియర్ రాజకీయవేత్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు అనారోగ్యంతో కన్ను మూయడంతో జనసేన నేతలు ఆయన తనయుడు క్యాబినెట్ మినిస్టర్ నాదెండ్ల మనోహర్‌ను కలిసి పరామర్శించి తమ సానుభూతిని తెలియజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం పిపిఎం మణ్యం జిల్లా జనసేన పార్టీ ఇన్చార్జ్ ఆదాడ.మోహన్ ఇంకా జనసేన నాయకులు గుమ్మా.నాగార్జున హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో ఉన్న నాదెండ్ల మనోహర్ నివాసానికి వెళ్లి పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అలాగే మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి పూలదండ వేసి అంజలి ఘటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తోటపల్లిలో విగ్రహావిష్కరణ



గరుగుబిల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త : తోటపల్లిలోని జట్టు ట్రస్టు కార్యాలయంలో జరిగిన కీ.శే.పి.ఎస్.ప్రకాశరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎం.ఎల్. సి. పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ ప్రకాశరావు మాస్టర్ ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం శ్రమించిన పోరాట యోధుడని కొనియాడారు. ముందుగా ప్రకాశరావు మాస్టర్ గారి విగ్రహాన్ని వారి కుటుంబ సభ్యులతో కలసి ఆవిష్కరించిన రఘు వర్మ ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఉండాల్సిన గురు శిష్య బంధాలను ప్రస్తావించారు. ప్రకాశరావు మాస్టర్ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న అనేక మంది విద్యార్థులు ఇప్పుడు చాలా గొప్ప స్థాయిలో ఉన్నారనీ వారందరూ ఇప్పటికీ ప్రకాశరావు సేవలు మరువలేదన్నారు. ఉపాధ్యాయులకు ముఖ్యంగా వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను పరిష్కరించడంలో చాలా విశేషమైన కృషి చేశారని తెలిపారు. మనందరం వారి ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉపాధ్యాయులు జోగినాయుడు గారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడు తూ ఉపాధ్యాయులు కు అతను మార్గదర్శి అని, క్రమశిక్షణ గల వారు అని కొనియాడారు. జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ ప్రకాశరావు గారితో జట్టు ట్రస్టు కు మరియు వ్యక్తిగతంగా తనకు ఎంతో సహకారం అందించారని, తేజో అనే పేరుతో ఎంతో మంది గిరిజన నిరాశ్రయ పిల్లలకు ఆశ్రయం కల్పించారని, ఉపన్యాసాలతో వట్టి మాటలు మాటలు మాట్లాడకుండా చేతలతో పనులు చేసి చూపిన మహనీయుడన్నారు.. వారి సహాయార్థం ఉపాధ్యాయులను సంఘటితం చేసి ఫండ్ సమకూర్చారని, జట్టు ట్రస్టు కార్యాలయ నిర్మాణానికి కూడా కొంత సహాయం అందించారని అందువల్ల వారి పేరుమీద ఒక బ్లాక్ నిర్మించామని ఆభవంలోనే ప్రకృతి వ్యవసాయ శిక్షణలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు వాసుదేవరావు మాట్లాడుతూ ప్రకాశరావు . కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాలతేరు శ్రీనివాస్. పాలతేరు కిరణ్, ఉపాధ్యాయులు, జట్టు ట్రస్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



నెల్లిమర్ల, ఏప్రిల్ 24, ప్రభాత వార్త : మండుతున్న ఎండ వేడిమి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమ త్తంగా ఉండాలని నెల్లి మర్ల ఎస్ఐ బి. గణేష్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పాదచారులు, వాహన చోదకులను దృష్టిలో పెట్టుకొని కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏర్పాటుచేసిన చలివేంద్రంను ఎస్ఐ గణేష్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు, తీవ్రవడగాల్పుల దృష్ట్యా ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతున్నదని దీనివల్ల ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని, తప్పనిసరి పరిస్థితుల్లో వస్తే శరీరం డిహైడ్రేషన్ కాకుండా ఎప్పటికప్పుడు మంచినీరు మజ్జిగ తీసుకోవాలని ఆయన సూచించారు. తొలి రోజు శుక్రవారం మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే ప్రజలకు అవగాహన నిమిత్తం డ్రగ్స్ ,మహిళల భద్రత ,రోడ్డు భద్రత నిమిత్తం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు ఏ. సత్యనారాయణ (సతీష్), రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒడిశా సర్కారు దౌర్జన్యంపై ఏపీకి మౌనం సరికాదు

### సీపీఎం జిల్లా కమిటీ ప్రకటన

సాలూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త : కొటియా వివాస్పద సరిహద్దు గ్రామాల్లో గిరిజనుల ఇల్లకు ఒరిస్సా పోలీసులతో వచ్చి మందుస్తు సమాచారం లేకుండా స్థానిక గిరిజనులు వ్యతిరేకించిన జనాభా లెక్కలు సేకరిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ ఖండించింది.శుక్రవారం జిల్లా కార్యదర్శి కొల్లి.గంగు నాయుడు మాట్లాడుతు ఒరిస్సా సర్కార్ సహకారంతో పోలీసులు దౌర్జన్యంగా గిరిజనులకు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.అలాగే అనేక సందర్భాల్లో ఏపి రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక మంత్రికి సమస్యను పరిష్కారంచలని సీపీఎం పార్టీ ఇంకా గిరిజనులు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా కేంద్రం జోక్యం చేసుకొని రెండురాష్ట్రాలతో చర్చలు జరిపి సరిహద్దు గ్రామాల సమస్య పరిష్కారించలని అలాగే మంత్రి చొరవ చూపాలని కోరారు.లేనియెడల గిరిజనులను సమీకరించి ఆందోళన పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు.పార్టీ నాయకులు ఎన్.వై.నాయుడు,కోరాడఈశ్వరరావు,మర్రి శ్రీను పాల్గొన్నారు.

## పేదలకు చీరలు పంపిణీ



లక్కవరపుకోట, ఏప్రిల్ 24, ప్రభాత వార్త: మండలంలోని శ్రీ రాంపురం గ్రామ కేంద్రం గా నడప బడుతున్న స్టీల్ ఎక్స్ చేంజ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం కంపెనీ ఎండి తండ్రి అయిన బండి రామారావు 30 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం ఈ సందర్భంగా బండి రామారావు మనువడు మోహిత్ మనుమరాలు రమీలలు చుట్టు పక్కన గల శ్రీ రాంపురం కొత్త పాలెం గ్రామం లోని మహిళలకు అలాగే కంపెనీ లో పని చేసే మహిళలకు మొత్తం గా 450 చీరలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ మాట్లాడుతు కంపెనీ ఏం డి లు అయిన బండి సురేష్ బండి రమేష్ ల తండ్రి అయిన బండి రామారావు ప్రోత్సాహం తో వ్యాపార రంగంలో ఉన్నత సిఖిరాలు అందుకున్నారు అని అయన తన జీవిత కాలం లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు అని తండ్రి బాట లోనే కంపెనీ యాజమానులు అయిన సురేష్ మరియు రమేష్ లు కంపెనీ చుట్టూ ప్రక్కల గ్రామాలలో మోలిక సదుపాయాల కల్పనతో పాటు అనేక సేవా కార్యక్రమాలు ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు ఎందరో నిరుద్యోగులు ఈ కంపెనీ లో పని చేస్తూ వారి కుటుంబాలను పోసించుకుంటున్నారు అని అలాగే జాతీయ అభివృద్ధి లో కంపెనీ తన ఉత్పత్తులు ద్వారా పాలు పంచుకుంటున్నది అన్నారు కంపెనీ ఉద్యోగులు అలాగే చుట్టూ వున్నా గ్రామాలలో గల ప్రజలు సంక్షేమము పట్ల కంపెనీ యాజమాన్యం సానుకూల దృక్పధంతో ఎప్పుడు వుంటుంది అన్నారు ఈ కార్యక్రమం లో కంపెనీ ప్రతినిధులు మేనేజర్ లు శ్రీ రాం పురం కొత్త పాలెం గ్రామాల మాజీ సర్పంచ్లు సేశావతారం అర్జున రావు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఒమ్మి విద్యార్థుల సత్తా

నెల్లిమర్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: సతివాడ ఆదర్శ పాఠశాల ఆరోతరగతి ప్రవేశపరీక్ష ఫలితాల్లో ఒమ్మి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం అండలూరి సత్యానందం ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రవేశ పరీక్షకు అన్ని పాఠశాలల నుండి మొత్తం 369 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఒక్క ఒమ్మి పాఠశాలకు ఐదు ర్యాంకులు దక్కాయన్నారు. మల్యాడ దేవిసామ్య 91 మార్కులు సాధించి రెండో ర్యాంక్ సాధించగా, అంబళ్ల జ్నానదీపు 90 మార్కులు సాధించి మూడో ర్యాంక్, పక్కి నిహారిక 85 తొమ్మిదో ర్యాంక్, అంబళ్ల దుర్గా ప్రణవి 84 మార్కులతో 12వ ర్యాంక్, పిన్నింటి సాహిత్య 76 మార్కులు సాధించి 33వ ర్యాంక్ సొంతం చేసుకున్నారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

## ఎల్.కోట నూతన ఎస్ఐగా రామకృష్ణ



లక్క వరపు కోట, ఏప్రిల్ 24,ప్రభాత వార్త : లక్కవరపుకోట మండలంకి నూతన ఎస్ఐగా జె రామ కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన నవీన్ పడాల్‌కు బొబ్బిలి బదిలీ కావడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి జె రామకృష్ణ బదిలీ పైన ఇక్కడకి వచ్చారు ఈయన 2020 బ్యాచ్ కి చెందిన వారు. ఈ సందర్భంగా ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ లక్కవరపు కోట పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్నానని, మండలంలో శాంతి భద్రతలు కాపాడటంలో అందరి సహాయ సహకారాలతో ముందుకు వెళతాను అన్నారు జిల్లా ఎస్‌పి, అలాగే ఇతర ఉన్నత అధికారుల సూచనలు మేరకులా ఆర్డర్ పరి రక్షణ కోసం కృషి చేస్తాను అన్నారు.

## నేడు ప్రత్యేక గ్రీవెన్స్

మక్కువ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త: మండల కేంద్రంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలనుండిరాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ మరియు గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అర్జునరావు తెలిపారు.

## కార్యదర్శులు సక్రమంగా పనిచేయాలి : డీఎల్‌పీవో



పాచిపెంట, ఏప్రిల్ 24: మండలం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ప్రజలతో మమాకమై వారి సేవలో కార్యదర్శులు పనిచేయాలని డిఎల్పిఒ నాగభూషణరావు అన్నారు. మండల కేంద్రమైన పాచిపెంట మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఆయన కార్యదర్శి సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీరు, పారిశుధ్యం పనులపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని కోరారు. సచివాలయం పరిధిలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కార్యదర్శిలకు ఆదేశించారు. ఎంపీడీవో బివిజే పాత్రో, ఈ ఒ పి ఆర్ డి మల్లేశ్వరరావు కార్యదర్శులు పాల్గొన్నారు.

## నాయుడువలసలో గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే



రామభద్రపురం, ఏప్రిల్ 24, ప్రభాత వార్త : గ్రామ స్థాయిలో ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతాను బేబీనాయన న చి వా ల య ం ల ో శ ా న స న భ ్ య ల ు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రీవెన్స్ నిర్వహించారు.. నాయుడువలస, సోంపురం, ఇట్లామామిడిపల్లి పంచాయితీలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ అర్జీలను ఎమ్మెల్యే అందజేయగా, తక్షణమే సమబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం, ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఈరోజు వచ్చిన 59 అర్జీలను (పెన్షన్లు 18 12, పంచాయితీ రాజ్ 10, హౌసింగ్ 03, రెవిన్యూ 07, విద్యుత్ శాఖ 04, 03, ఆరోగ్యశాఖ . వాహనమిత్ర పథకం 02) పరిశీలించి సంబంధిత అధికారులు వాటిని ఒకటి రెండు వారాల గడువులో పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు. విజయనగరం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు , రామభద్రపురం మండలం టీడీపీ అధ్యక్షులు కరణం భాస్కరరావు , విజయనగరం పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు క్రోతు తిరుపతి రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ, విద్యుత్ శాఖ, హౌసింగ్, పోలీసు శాఖ, ఇరిగేషన్ మొదలగు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు .

## ధర్మరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



నెల్లిమర్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: ధర్మ రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని నిష్కల్మషానంద తోంద్రంగి అప్పారావు ఆర్యులు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపు పేట లో విమలాంబ ఈశ్వరి మాత 5వ వార్షికారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అచలానంద పోలుబోతు రామారావు ఆర్యులు ఆధ్వర్యంలో జరిగిన వేద వేదాన్తీత వైజ్ఞానిక మహాసభలో అప్పారావు మాట్లాడారు. ఇతరులకు హాని తలపెట్టకుండా, సహాయం చేసేందుకు నిరంతరం సిద్ధంగా ఉన్నప్పుడే మానవజన్మ సుకృతం అవుతుందని అన్నారు. జీవులను గౌరవించడమే ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. పెద్దలను గౌరవించడం, ఇతరులను ప్రేమించడం నిత్య కృత్యంగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాతాజీ నిత్య నిర్మలాంబ సీతా మహాలక్ష్మమ్మ, భావానంద కెల్ల ఆదినారాయణ ఆర్యులు , నిర్మలానంద అద్దేపల్లి తాతబ్బాయి ఆర్యులు, విమలాంబ ఈశ్వరి మాత సమేత అచలానంద పూలు బూతు రామారావు ఆర్యులు ప్రసంగించారు. అనంతరం మహిళా సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కాళేశ్వరీ మాతాజీ, సమరస నిర్మలాంబ కొయ్యినేని సింహాచలాయమ్మ, పూర్ణాంభ అమ్మడమ్మ తదితరులు మహిళలను ఉద్దేశించి ప్రవచనం చేశారు. శుక్రవారం ఉదయం మేలుకొలుపు ప్రభాత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురుభక్త శ్రేష్టానంద భాస్కరరావు ఆధ్వర్యంలో గురు గీతా పారాయణం జరిగింది. పోలుబోతు రామారావు ఆర్యులు పాదుకా పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విధిగా ఫొటోలు అప్లోడ్ చేయాలి



మక్కువ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: మండలంలో సంబర పంచాయతీలో సబ్బివాని చెరువు పనులను ఎంపీడీవో అర్జునరావు శుక్రవారం తనిఖీ నిర్వహించారు. వేతనదారుల మాస్టర్ల ను వెరిఫై చేస్తూ ఎన్ఎంఎంఎస్ లో విధిగా ఫోటోలు అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్క వేతన దారుడు వారి ఇంటి దగ్గర ఇంకుడు గుంతలను తవ్వించుకోవాలని వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ శ్రీనివాసరావు బీఎఫ్టీ ఈశ్వరరావు ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

## నేలబావిలో పడి ఒకరి మృతి

రామభద్రపురం, ఏప్రిల్ 24, ప్రభాత వార్త : దాహార్తిని తీర్చుకోవడానికి వెళ్ళి ప్రమాద వశాత్తూ నేలబావిలో జారిపడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తారాపురం గ్రామానికి చెందిన పిల్ల లక్ష్మణ (77) శుక్రవారం ఉదయం పొలం పనికి వెళ్లి చాకిరేవు పొలంలో సామంతులు కొత్తయ్యకు చెందిన నేలబావిలో నీరు తాగడానికి దిగుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై అతని కుమారుడు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్చి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు

## రుణాలను వినియోగించుకోవాలి



కొత్తవలస (ప్రభాత వార్త) ఏప్రిల్ 24: గులివిందాడ గ్రామ సంఘంలో జరుగుచున్న సూక్ష్మ క్రెడిట్ ఋణ ప్రణాళిక (తిదిలిశి) ను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి (వెలుగు) పరిశీలించారు. ఈసందర్భమ్గా మాట్లాడుతూ సభ్యులకు అవసరమైన మేరకు జీవనోపాదులు కల్పనకు తిదిలిశి ను ఉపయోగించు కోవాలని తెలియజేశారు.ప్రభుత్వం సి.ఐ. ఎఫ్,ఉన్నతి,స్త్రీనిధి, బ్యాంకు నుండి సభ్యులకు ఋణాలు జీవనోపాధులకు మంజూరు, గత సంవత్సరం జిల్లాలో 1500 కోట్లు మంజూరు చేయడం జరిగిందిని తెలిపారు. గ్రామంలో చదువుకొని ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందిని తెలియజేశార ఈ సంవత్సరంలో తీసుకుంటున్న ఋణాలు జీవనోపాదులకు తీసుకొంటున్నారో 100 దానికే వినియోగించాలన్నారు.. సమావేశంనకు కొత్తవలస మండలం ఎపిఎం ఎ.వెంకటరమణ, జిల్లా ఐబి ఎపిఎం వి. విశ్వేశ్వరరావు , గ్రామ సంఘం అధ్యక్షులు పి. లక్ష్మి, సిసి ఎం. భారతి , విఒఏ లు జి. ఎర్ణమ్మ, జి. దేవి, ఈ నారీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నెల్లిమర్ల మండలంలో ఆర్డీవో పర్యటన



నెల్లిమర్ల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: విజయనగరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. సుధాసాగర్ శుక్రవారం నెల్లిమర్ల మండలంలో పర్యటించారు. పినతరిమి గ్రామంలో సబ్‌స్టేషన్, హెలీప్యాడ్ కోసం ప్రతిపాదించిన భూమి, నెల్లిమర్లలో ప్రతిపాదించిన ఎస్ టి పి , సతివాడ గ్రామంలో ఎఫ్ పి ఓ కేంద్రం కోసం ప్రతిపాదించిన భూమి, నెల్లిమర్ల అర్బన్‌లో ఉన్న మార్కెట్ యార్డులో హెలీప్యాడ్ కోసం ప్రతిపాదించిన భూమిని ఆయన పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ కె. శ్రీకాంత్, మండల సర్వేయర్ వెంకట రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి. సతీష్, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

## రియాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో చలివేంద్రం



బొబ్బిలి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: పట్టణం చెందిన మాజీ కో ఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బొబ్బిలి మెయిన్ రోడ్‌లో తన షాప్ వద్ద వేసవి తాపాన్ని చల్లబరచడానికి చలివేంద్రాన్ని ప్రారంభించమని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం



బొబ్బిలి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : అంతర్జాతీయ రోటరీ బొబ్బిలి యూనిట్ ద్వారా చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను విస్తృతం చేయాలని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జె క్యూ రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రోటరీ కార్యాలయంలో రోటరీ సభ్యులతో సమావేశాన్ని బొబ్బిలి క్లబ్ అధ్యక్షులు శ్రీహరి, కార్యదర్శి శివకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా గడచిన కాలంలో రోటరీ సంస్థద్వారా చేసిన సేవాకార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ రోటరీ సభ్యులు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత నిస్తూ రోటరీ కి సమాజంలో మంచి గుర్తింపు ని తేవాలన్నారు. రోటరీ ద్వారా మహిళలకు లక్షా 50 వేల రూపాయల విలువచేసే కుట్టుమిషనులను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. మున్సిపల్ అధికారులు అనుమతితో చర్చ్ సెంటర్ లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టే ఆలోచన చేస్తున్నామన్నారు. కాన్సర్ స్క్రీనింగ్ పాప్ స్మియెర్ పరీక్షలు బ్రెస్ట్ కాన్సర్ పరీక్షలు ఈ నెలాఖరున నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల విజయవాడ కె ఎల్ యూనివర్సిటీలోనిర్వహించే డిస్ట్రిక్ట్ లెర్నింగ్ సెమినార్ కు వివిధ విభాగాల చైర్మన్స్ ను హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ డైరెక్టర్ శ్రీనివాసన్ పూర్వ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ సంకర రావు, కృష్ణ మోహన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు వాడిన వారిని కఠినంగా శిక్షిస్తాం



బొబ్బిలి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త: కోమటిపల్లి గ్రామంలో ఇటీవల మాదకద్రవ్యాలపై యువత మొగ్గు చూపుతున్నారని ఉద్దేశంతో సీఐ కె నారాయణ రావు కేటీఆర్ స్కూల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గాంజాయ్ తదితర ముత్తు పదార్థాలు వాడితే సిఫార్సులకు కూడా లెక్క చేయమని వారిపై కఠిన శిక్షలు విధించడం తప్పదని ఆయన యువతను హెచ్చరించారు. బెట్టింగులు ఈవ్ టీజింగ్ అంశాలపై దీర్ఘంగా ఉపన్యసించారు. జీవితాలను నాశనం చేసుకోవాలంటే మీరు డ్రగ్స్ వినియోగం చేస్తారని మిమ్మల్ని నమ్ముకుని మీ తల్లిదండ్రులు ఇక్కడికి పంపించారంటే వారి ఆశయాలు మీరు తప్పకుండా పాటించి వారికి మంచి పేరు తేవాలని అన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో



వంగర,ఏప్రిల్ 24, ప్రభాతవార్త: తహశీల్దార్ కార్యాలయాన్ని చీపురుపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం. సుధారాణి శుక్రవారం సందర్శించారు. ముందుగా మండల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మండలంలో చేపడుతున్న భూ రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ వాటి సవరణలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.. లేట్ రిజిస్ట్రేషన్ బర్త్ డెత్ మరియు ఇతర సర్టిఫికెట్ల విషయంలో అలసత్వం వహించకుండా వెంటనే సంబంధిత వీఆర్ఏలతో పంపించాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. ఏవైనా ఫైల్లు ఆర్డీవో కార్యాలయానికి చేరవేయడంలో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే మెమోలు జారీ జారీ చేస్తామని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే కొందరికి మెమో లు కూడా జారీ చేసి ఉన్నామని ఆమె అన్నారు. జూన్ నెలాఖరుకల్లా భూ రికార్డులన్నీ సరిచేసి పూర్తిస్థాయిలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. అనంతరం రికార్డులు భద్రపరిచిన గదిని పరిశీలించి ఫైల్స్ ను సెక్షన్ వైస్‌గా ఇయర్ వైస్‌గా క్రమ పద్ధతిలో భద్రపరచాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో తాసిల్దార్ పిన్నింటి రామారావు, ఆర్ ఐ లు రామారావు, ఈశ్వర రావు, రెవెన్యూ డిటి శ్రీనివాసరావు మండల సర్వేరు, వీఆర్ఏలు, ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసుర్లపేటలో తాగునీటికి కటకట

సరుబుజ్జిలి, ఏప్రిల్ 24, ప్రభాత వార్త : మండలం ఎమ్మెస్ పురం పంచాయతీ వ్యాసుర్ల పేటలో తాగునీటికి కటకటలాడుతున్నారు. కొన్నేళ్ల క్రితం నీటి గురించి గ్రామంలో సంబంధం అధికారులతో పరీక్షలు చేయగా, పలుచోట్ల ఫ్లోరైడ్‌తో నీరు ఉండటంతో చివరగా తాగునీటికి అనుకూలంగా ఉండే ప్రదేశంలో బోరు తవ్వించి గ్రామంకు నీటి సరఫరా చేయించారు. గత కొన్నేళ్లుగా విద్యుత్ ప్యానెల్ బోర్డులు సర్క్యూట్లు మోటర్ పనిచేయకపోవడంతో గ్రామస్తులు తాగునీటికై కటకట లాడుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో ఎం పావని ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారే గాని ఇంతవరకు పనులు చేపట్టకపోవడంతో ఆమె నిర్లక్ష్యానికి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

